RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | శనివారం 1-8-2026 | సంచిక: 13 | సంఖ్య: 304 పేజీలు: 8 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి




# పెట్టుబడులకు తెలంగాణే భరోసా




## సీఐఐ ఉత్తరాది ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానం

## పెట్టుబడులకు పూర్తి రక్షణ.. పరిశ్రమలకు అనుకూల వాతావరణం

## ఫ్యూచర్ సిటీలో ఫార్చ్యూన్--500 కంపెనీలే లక్ష్యం

## క్యూర్, ప్యూర్, రేర్ విధానంతో సమతుల అభివృద్ధి

## నైపుణ్యాభివృద్ధితో ఉపాధి.. డేటా సెంటర్లకు భారీ పెట్టుబడులు

హైదరాబాద్ : భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఉత్తరాది ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ పారిశ్రామిక విధానాన్ని వివరించారు. గత ప్రభుత్వాల కాలంలో తీసుకొచ్చిన మంచి విధానాలను కొనసాగిస్తూనే, మారుతున్న అవసరాలకు అనుగుణంగా కొత్త విధానాలను అమలు చేస్తున్నామని చెప్పారు. నాయకులు మారినా, పార్టీలు మారినా పరిశ్రమలకు ఉపయోగపడే నిర్ణయాలను కొనసాగించడం తెలంగాణ ప్రత్యేకతగా పేర్కొన్నారు. రాష్ట్రాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మూడు అభివృద్ధి మండలాలుగా విభజించినట్లు సీఎం వివరించారు. ఔటర్ రింగ్‌రోడ్డు లోపలి ప్రాంతాన్ని 'క్యూర్' జోన్‌గా అభివృద్ధి చేసి సేవారంగానికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి రీజనల్ రింగ్‌రోడ్డు మధ్య ప్రాంతాన్ని 'ప్యూర్' జోన్‌గా రూపొందించి తయారీ పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. రీజనల్ రింగ్‌రోడ్డు వెలుపల ప్రాంతాన్ని 'రేర్' జోన్‌గా అభివృద్ధి చేస్తూ వ్యవసాయం, అనుబంధ పరిశ్రమలకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని పరిశ్రమలను దశలవారీగా ప్యూర్ జోన్‌కు తరలించే ప్రణాళిక సిద్ధం చేశామని, రేడియల్ రోడ్లు, ఆధునిక రవాణా సదుపాయాలు, మచిలీపట్నం పోర్టుకు 12 లేన్ల అనుసంధాన రహదారి ద్వారా పరిశ్రమలకు

(మిగతా 2వ పేజీలో)

## హైడ్రా నుంచి రంగనాథ్‌ను వెంటనే బదిలీ చేయండి



- లోతుకుంట భూముల వివాదంలో కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారని హైకోర్టు ఆగ్రహం
- వివాదాస్పద స్థలంలోకి సిబ్బందితో వెళ్లడం చట్టవిరుద్ధమని స్పష్టం
- వ్యక్తుల ఆధిపత్యం పెరిగితే ప్రజాస్వామ్యానికి ప్రమాదమని వ్యాఖ్య



# పెద్ది సుదర్శన్‌కి తుది వీడ్కోలు

- ప్రజానేత అంతిమయాత్రకు తరలివచ్చిన అభిమానులు
- కుటుంబ సభ్యులు, కార్యకర్తల కన్నీరుమున్నీరు
- ఉద్వేగానికి లోనై కంటతడి పెట్టుకున్న హరీశ్‌రావు
- పలువురు ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు నివాళులు
- గుండెపోటుతో చికిత్స పొందుతూ యశోద ఆస్పత్రిలో తుదిశ్వాస

నర్సంపేట: వరంగల్ జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి స్వగ్రామంలో అధికా రిక లాంఛనాలతో అంతిమ వీడ్కో లు పలికారు. ఆయన భౌతిక కాయాన్ని చివరిసారిగా చూసేం దుకు పెద్ద సంఖ్యలో పార్టీ కార్య కర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు తరలివచ్చారు. పూల మాలలు సమర్పిస్తూ

(మిగతా 2వ పేజీలో)



## ఫార్ములా ఈ- కేసులో మరో మలుపు

# ఏసీబీ ప్రత్యేక కోర్టుకు కేటీఆర్

- అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డి కూడా కోర్టులో ప్రత్యక్షం
- తదుపరి విచారణ ఆగస్టు 25కు వాయిదా
- రూ.55 కోట్ల వ్యయంపై ఏసీబీ అభియోగాలు
- కోర్టు వద్ద భారీగా చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు
- కేసు విచారణపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి

హైదరాబాద్ : ఫార్ములా ఈ-కార్ రేసు వ్యవహారంలో నమోదైన కేసు మరోసారి రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసులో ఏ1గా ఉన్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌తో పాటు ఇతర నిందితులు నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి విచారణను ఆగస్టు 25కు వాయిదా వేసింది. హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టులో శుక్రవారం ఫార్ములా

## క్షమతో కూడిన సందేశం..

# యువతకు మోదీ పిలుపు



- జంతర్‌మంతర్ ఘటనపై ప్రధాని స్పందన
- దూషణలు బాధించాయని వ్యాఖ్య
- దారి తప్పిన యువతను సరిదిద్దాలని పిలుపు
- దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచన
- నొయిడా యువతిపై ఇప్పటికే జీరో ఎఫ్ఐఆర్

## జెన్‌జీ, ఇంజనీరింగ్ విద్యార్థులను అవమానిస్తారా?: రేవంత్‌పై కిషన్‌రెడ్డి ఫైర్



- ఉపాధ్యాయుల సమావేశంలో విద్యార్థులను రేవంత్ అవమానించారన్న కిషన్‌రెడ్డి
- విద్యార్థులను క్రిమినల్స్‌తో పోల్చడం సరికాదని వ్యాఖ్య
- విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని హితవు



## పోటెత్తుతున్న

# గోదావరి

- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- భద్రాచలం వద్ద 48 అడుగులకు చేరుకున్న గోదావరి నీటి మట్టం
- నిండుకుండలా మారిన తెలంగాణలోని జలాశయాలు
- జలాశయాలకు వరద పెరుగుతుండటంతో అప్రమత్తమైన అధికారులు

హైదరాబాద్ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి వచ్చి చేరుతున్న భారీ వరదతో నీటి మట్టం మధ్యాహ్నానికి ఏకంగా 48 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం అధికారులు 11,44,507 క్యూసెక్కుల

(మిగతా 2వ పేజీలో)

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# పెట్టుబడులకు తెలంగాణే భరోసా

వేగవంతమైన రవాణా సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఈ చర్యలతో పెట్టుబడిదారులకు ఉత్పత్తి, ఎగుమతుల పరంగా మరింత అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని వివరించారు. హైదరాబాద్ దేశంలోనే అత్యంత అనువైన పెట్టుబడి కేంద్రంగా ఎదుగుతోందని సీఎం పేర్కొన్నారు. కాలుష్యం, ట్రాఫిక్, ప్రకృతి వైపరీత్యాలు వంటి సమస్యలు ఇతర మెట్రో నగరాలను ప్రభావితం చేస్తున్నప్పటికీ, తెలంగాణలో పెట్టుబడులకు స్థిరమైన వాతావరణం ఉందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టిన వారికి మెరుగైన మౌలిక వసతులు, వేగవంతమైన అనుమతులు, ప్రభుత్వ పూర్తి సహకారం లభిస్తుందని తెలిపారు. పరిశ్రమల శాఖ మంత్రి ప్రతి రెండు నెలలకు, తాను ప్రతి మూడు నెలలకు పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమై సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. కృత్రిమ మేధస్సు ప్రభావంతో సంప్రదాయ ఉద్యోగాల్లో మార్పులు వస్తున్న నేపథ్యంలో యువతకు అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. ఐటీఐలను ఆధునిక శిక్షణ కేంద్రాలుగా అభివృద్ధి చేస్తూ పరిశ్రమలకు అవసరమైన కోర్సులను మాత్రమే బోధిస్తున్నామని, అక్కడ శిక్షణ పొందిన వారికి దాదాపు వందశాతం ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని వెల్లడించారు. రాష్ట్రంలో గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ల విస్తరణ వేగంగా జరుగుతోందని సీఎం తెలిపారు. ఇప్పటికే 200కు పైగా అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌లో పెట్టుబడులకు ముందుకు వచ్చాయని, డేటా సెంటర్ల రంగంలో అమెజాన్




సుమారు లక్ష కోట్ల రూపాయలు, అదానీ గ్రూప్ రూ.35 వేల కోట్ల పెట్టుబడులు ప్రకటించాయని చెప్పారు. పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల విస్తరణతో తెలంగాణ దేశంలోనే అత్యంత ఆకర్షణీయ పెట్టుబడి గమ్యస్థానంగా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# హైడ్రా నుంచి రంగనాథ్‌ను వెంటనే బదిలీ చేయండి: హైకోర్టు తాజా ఉత్తర్వులు

**లోతుకుంట భూముల వివాదంలో కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారని ఆగ్రహం**

**వివాదాస్పద స్థలంలోకి సిబ్బందితో వెళ్లడం చట్టవిరుద్ధమని స్పష్టం**

**వ్యక్తుల ఆధిపత్యం పెరిగితే ప్రజాస్వామ్యానికి ప్రమాదమని వ్యాఖ్య**

హైదరాబాద్ : హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు ఇటీవల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం తెలిసిందే. న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘించినందుకు గాను, ఆయన్ను తక్షణమే ఆ పదవి నుంచి బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. తాజాగా, రంగనాథ్ స్థానంలో మరొక అధికారిని నియమించాలని నేడు ఉత్తర్వులు జారీ చేసింది. లోతుకుంట భూముల వ్యవహారంలో హైడ్రాకు, శాంత శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ కేసులో గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను రంగనాథ్ స్పష్టంగా ఉల్లంఘించారని న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది. వివాదాస్పద స్థలంలోకి యంత్రాలు, సిబ్బందితో ప్రవేశించడం పూర్తిగా చట్టవిరుద్ధమని తేల్చిచెప్పింది. ఇదే కేసులో రంగనాథ్ కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని గతంలోనే హైకోర్టు అభిప్రాయపడిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. టాటా మోహన్ రావు కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును ఉటంకిస్తూ, దేశంలో చట్టబద్ధమైన పాలన మాత్రమే కొనసాగాలని స్పష్టం చేసింది. వ్యక్తుల ఆధిపత్యం పెరగడం ప్రజాస్వామ్యానికి 'మరణశాసనం' వంటిదని హైకోర్టు ఘాటుగా హెచ్చరించింది.



# క్షమతో కూడిన సందేశం.. యువతకు మోదీ పిలుపు

జంతర్‌మంతర్ ఘటనపై ప్రధాని స్పందన

దూషణలు బాధించాయని వ్యాఖ్య

శిక్ష కాదు.. మార్పే ముఖ్యమన్న ప్రధాని

దారి తప్పిన యువతను సరిదిద్దాలని పిలుపు

దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచన

నొయిడా యువతిపై ఇప్పటికే జీరో ఎఫ్ఐఆర్

జంతర్‌మంతర్ వద్ద తనను, తన తల్లిని దూషించిన ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. యువత చేసిన వ్యాఖ్యలు బాధాకరమైనవేనని పేర్కొంటూనే, వారిని శిక్షించడం కంటే సరైన మార్గంలో నడిపించడం సమాజం బాధ్యత అని అన్నారు. తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని యువతకు పిలుపునిచ్చారు. జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో కొందరు యువకులు, యువతులు తనపై, తన దివంగత తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ వీడియో సందేశం ద్వారా స్పందించారు. ఈ ఘటనను దేశంతో పాటు ప్రపంచమంతా చూసిందని పేర్కొన్న ఆయన, అలాంటి భాష వినడం బాధాకరమని అన్నారు. ముఖ్యంగా యువతులు అసభ్యకరమైన పదజాలం ఉపయోగించడం దిగ్భ్రాంతికి గురిచేసిందని వ్యాఖ్యానించారు. అయితే యవ్వనంలో కొన్నిసార్లు భావోద్వేగాలకు లోనై తప్పులు జరగవచ్చని మోదీ అన్నారు. అలాంటి వారిని శిక్షించడం, కోర్టుల చుట్టూ తిప్పడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని, వారిని సరైన దిశలో నడిపించడమే సమాజం బాధ్యత అని స్పష్టం చేశారు. ద్వేషానికి



బదులుగా సంభాషణ, మార్గనిర్దేశం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. తనను దూషించిన వారిపై వ్యక్తిగతంగా ఎలాంటి ద్వేషం లేదని, వారిని తాను క్షమిస్తున్నానని ప్రధాని ప్రకటించారు. ప్రతి తప్పు ఒక పాఠంగా మారాలని, యువత తమ శక్తి, సామర్థ్యాలను దేశ అభివృద్ధి కోసం వినియోగించాలని సూచించారు. భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా, జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనలో ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నొయిడాకు చెందిన యువతి రుచికా సింగ్‌పై ఇప్పటికే జీరో ఎఫ్ఐఆర్ నమోదు కాగా, ఆ అంశం ప్రస్తుతం విచారణలో ఉంది. ప్రధాని వ్యాఖ్యలు రాజకీయంగానే కాకుండా సామాజికంగా కూడా చర్చనీయాంశంగా మారాయి.

## వివాహితులైన కుమార్తెలకు ఉద్యోగ హక్కు: కారుణ్య నియామకంపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

కారుణ్య నియామకాలకు సంబంధించి సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన తీర్పును వెలువరించింది. వివాహిత అనే కారణంతో కుమార్తెకు కారుణ్య నియామకాన్ని నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని ధర్మాసనం శుక్రవారం స్పష్టం చేసింది. కేవలం విడాకులు తీసుకున్న లేదా భర్త నుంచి విడిపోయిన కుమార్తెలకు మాత్రమే ఈ అవకాశం కల్పించే ప్రభుత్వ నిబంధనలు చెల్లవని తేల్చిచెప్పింది. ఇటువంటి వర్గీకరణ రాజ్యాంగంలోని అధికరణ 14 ప్రకారం కల్పించిన సమానత్వ హక్కుకు పూర్తి విరుద్ధమని న్యాయస్థానం పేర్కొంది. బీహార్ ప్రభుత్వానికి చెందిన 2014 నాటి విధానాన్ని సవాలు చేస్తూ సయారా ఖాతూన్, ఆమె కుమార్తె దాఖలు చేసిన అప్పీల్‌పై జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బి. వరాలేతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. తండ్రి మరణానంతరం ఉద్యోగం కోసం కుమార్తె చేసుకున్న దరఖాస్తును తొలుత బీహార్ ప్రభుత్వం, అనంతరం పాట్నా హైకోర్టు తిరస్కరించడంతో బాధిత కుటుంబం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "కుమారులు, కుమార్తెల మధ్య ఎలాంటి వివక్ష చూపినా అది రాజ్యాంగబద్ధం కాదు. వివాహం తర్వాత కుమార్తెకు పుట్టింటితో బంధం తెగిపోతుందని, ఆమె కేవలం భర్తపైనే ఆధారపడి జీవిస్తుందని భావించడం తగదు" అని అభిప్రాయపడింది. కేవలం సాంకేతిక కారణాలను సాకుగా చూపి దరఖాస్తులను తిరస్కరించడం సరికాదని స్పష్టం చేసింది. మృతుడి సోదరుడు తొలుత అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, అనంతరం నిరభ్యంతర పత్రం సమర్పించిన విషయాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకుంది. పాట్నా హైకోర్టు ఉత్తర్వులను, బీహార్ ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టివేసిన సుప్రీంకోర్టు పిటిషనర్ అభ్యర్థనను ఎనిమిది వారాల్లోగా మెరిట్ ప్రాతిపదికన పునఃపరిశీలించాలని అధికారులను ఆదేశించింది. కారుణ్య నియామకాలకు కుటుంబ ఆర్థిక స్థితిగతులు, అవసరాలే ప్రామాణికం కావాలని, వివాహ స్థితి కాదని ఈ తీర్పు ద్వారా సర్వోన్నత న్యాయస్థానం పునరుద్ఘాటించింది.

## జెన్ జీ, ఇంజనీరింగ్ విద్యార్థులను అవమానిస్తారా?: రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి ఫైర్

**ఉపాధ్యాయుల సమావేశంలో విద్యార్థులను రేవంత్ అవమానించారన్న కిషన్ రెడ్డి**

**విద్యార్థులను క్రిమినల్స్‌తో పోల్చడం సరికాదని వ్యాఖ్య**

**విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని హితవు**

హైదరాబాద్ : ఇటీవల ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులపై చేసిన వ్యాఖ్యలను కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇంజనీరింగ్ విద్యార్థులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవమానించారని మండిపడ్డారు. ఇది సరైన పద్ధతి కాదని... యువతను 'క్రిమినల్ వేస్ట్' అని సంబోధించడం అత్యంత బాధాకరమని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారనే అక్కసుతోనే రేవంత్ రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలకు దిగారని ఆయన ఆరోపించారు. దేశ నిర్మాణంలో ఇంజనీర్లు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని కిషన్ రెడ్డి



చెప్పారు. విద్యార్థులను క్రిమినల్స్‌తో పోల్చడం సిగ్గుచేటని మండిపడ్డారు. జెన్ జీ ఆకాంక్షలకు, భావాలకు వ్యతిరేకంగా పాలకులు వెళ్లడం సరికాదని హితవు పలికారు. రేవంత్ రెడ్డి విద్యార్థులపై నిందలు వేయడం మాని, రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అవసరమైన విద్యా సంస్కరణలపై దృష్టి పెట్టాలని సూచించారు.

# పెద్ది సుదర్శన్‌కి తుది వీడ్కోలు

తమ అభిమాన నాయకుడికి అశ్రునివాళి అర్పించారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవగా, అక్కడి వాతావరణం తీవ్ర విషాదభరితంగా మారింది. అంతిమయాత్రలో మాజీ మంత్రి హరీశ్‌రావు, పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ ముఖ్య నేతలు పాల్గొన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ హరీశ్‌రావు భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టుకున్నారు. పార్టీకి ఆయన అందించిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. ప్రజలతో మమేకమై పనిచేసిన నాయకుడిగా ఆయనను కొనియాడారు. ఈ నెల 26న హనుమకొండలో ఉన్న సమయంలో పెద్ది సుదర్శన్‌రెడ్డికి అకస్మాత్తుగా ఛాతీలో నొప్పి రావడంతో తొలుత స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు గుండెపోటుగా నిర్ధారించి అత్యవసర చికిత్స అందించారు. పలుమార్లు సీపీఆర్ నిర్వహించిన అనంతరం పరిస్థితి కొంత మెరుగుపడటంతో మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. యశోద ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగించినప్పటికీ ఆరోగ్య పరిస్థితి మరింత విషమించింది. గురువారం అర్ధరాత్రి 12.50 గంటల సమయంలో ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో వరంగల్ జిల్లా రాజకీయాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయనకు ఘనంగా తుది వీడ్కోలు పలికారు. ఆయన సేవలు, ప్రజలతో కలిసిమెలిసి పనిచేసిన తీరు చిరస్మరణీయమని పలువురు నేతలు నివాళులర్పించారు.

## ఫార్ములా ఈ- కేసులో మరో మలుపు

# ఏసీబీ ప్రత్యేక కోర్టుకు కేటీఆర్

హాజరయ్యారు. ఆయనతో పాటు రెండో నిందితుడైన మాజీ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి కూడా కోర్టులో ప్రత్యక్షమయ్యారు. కేటీఆర్ కోర్టుకు చేరుకునే సమయంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్‌తో పాటు పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దీంతో నాంపల్లి కోర్టు పరిసర ప్రాంతాల్లో కొంతసేపు ట్రాఫిక్ రద్దీ నెలకొంది. భద్రతా ఏర్పాట్లను పోలీసులు కట్టుదిట్టం చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసు నిర్వహణ, ట్రాక్ నిర్మాణం, ఇతర ఏర్పాట్ల పేరిట హెచ్ఎండీఏ నిధుల నుంచి రూ.55 కోట్లకు పైగా ఖర్చు చేశారనే ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తు చేపట్టింది. అధికారిక అనుమతులు, పూర్తి రికార్డులు లేకుండానే భారీ మొత్తాలు విడుదల చేశారని, ఆడిట్ ప్రక్రియను తప్పించేందుకు ప్రయత్నించారనే అభియోగాలు చార్జిషీట్‌లో పొందుపరిచినట్లు అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా మూడు సీజన్లకు సంబంధించిన ఖర్చులను ఒకే రేసుకు సంబంధించిన వ్యయంగా చూపించి కేబినెట్ ఆమోదం లేకుండానే నిర్ణయాలు తీసుకున్నారని దర్యాప్తు సంస్థ ఆరోపిస్తోంది. విదేశీ సంస్థలకు నిధుల బదిలీలో రిజర్వ్ బ్యాంక్ నిబంధనలు, పన్ను చట్టాలను ఉల్లంఘించారని, దీనివల్ల ప్రభుత్వంపై రూ.8.06 కోట్ల అదనపు పన్ను భారం పడిందని ఏసీబీ తన అభియోగాల్లో పేర్కొంది. ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన ఏసీబీ ప్రత్యేక కోర్టు కేసులో తదుపరి విచారణను ఆగస్టు 25కు వాయిదా వేసింది. అప్పటి వరకు కేసుకు సంబంధించిన తదుపరి న్యాయ ప్రక్రియ కొనసాగనుంది. ఫార్ములా ఈ-కార్ రేసు వ్యవహారం రాజకీయంగా కూడా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో ఈ కేసు విచారణపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

# పోటెత్తుతున్న గోదావరి

నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నీటిప్రవాహం గంటగంటకూ పెరుగుతుండటంతో నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు, తెలంగాణలోని ప్రధాన జలాశయాలన్నీ వరద నీటితో నిండుకుండలా మారాయి. కడెం ప్రాజెక్టు నీటిమట్టం 698.02 అడుగులకు (పూర్తి స్థాయి 700 అడుగులు) చేరగా, 10,282 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదవుతోంది. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులోకి 70 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా, నీటిమట్టం 1069 అడుగుల వద్ద ఉంది. ఇక శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 148 మీటర్లు కాగా, ప్రస్తుతం 147.30 మీటర్లకు చేరుకుంది. ఎల్లంపల్లిలోకి 1,32,785 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండటంతో, అంతే మొత్తంలో (1,32,785 క్యూసెక్కులు) నీటిని దిగువకు వదులుతున్నారు. అలాగే మిడ్ మానేరు ప్రాజెక్టులోకి 18,445 క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతోంది. జలాశయాల నీటిమట్టం వేగంగా పెరుగుతుండటంతో ప్రాజెక్టుల వద్ద యంత్రాంగం నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తోంది.




## పీఎఫ్ చందాదారులకు గుడ్ న్యూస్... ఇకపై యూపీఐతో క్లెయిమ్స్

నెల రోజుల్లో భీమ్-యూపీఐ ద్వారా పీఎఫ్ క్లెయిమ్స్

డబ్బులు నేరుగా యూపీఐ లింక్డ్ ఖాతాల్లోకి జమ

వివరాలు వెల్లడించిన సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్

దాదాపు అదే రోజు క్లెయిమ్స్ సెటిల్ చేయడమే లక్ష్యం

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) తన సేవలను ఆధునికీకరించే దిశగా మరో కీలక అడుగు వేస్తోంది. పీఎఫ్ క్లెయిమ్స్‌లను 'భీమ్' యాప్ ద్వారా పరిష్కరించేలా నూతన విధానాన్ని ప్రవేశపెడుతోంది. ఈ సౌకర్యం నెల రోజుల్లోనే అందుబాటులోకి వస్తుందని సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ రమేష్ కృష్ణమూర్తి శుక్రవారం వెల్లడించారు. ఈ నూతన విధానం ద్వారా ఈపీఎఫ్ఓ సభ్యులు తమ క్లెయిమ్ లను భీమ్ యాప్ ద్వారా సమర్పించవచ్చని, సెటిల్ అయిన మొత్తం నేరుగా వారి యూపీఐ అనుసంధిత బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని ఆయన వివరించారు. దీనివల్ల క్లెయిమ్స్ ప్రక్రియ మరింత వేగంగా, సులభతరంగా మారుతుందని పేర్కొన్నారు. ఉద్యోగులు, యాజమాన్యాలకు మెరుగైన సేవలను అందించే లక్ష్యంతో ఈపీఎఫ్ఓ ఈ సంస్కరణలు చేపట్టింది. క్లెయిమ్ పరిష్కారంలో గతంలో ఉన్న జాప్యాన్ని ఇప్పటికే అధిగమించామని, ఆటో-సెటిల్‌మెంట్ రేట్లు 90 శాతానికి చేరిందని కృష్ణమూర్తి తెలిపారు. భవిష్యత్తులో వచ్చే క్లెయిమ్స్‌లను వీలైనంత వరకు అదే రోజు లేదా గరిష్ఠంగా రెండు రోజుల్లోపు పరిష్కరించడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లకు సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం త్వరలో ప్రత్యేక పథకాన్ని ప్రకటించనుందని కృష్ణమూర్తి వెల్లడించారు. ఈ బాధ్యతను ఈపీఎఫ్ఓ లేదా మరో ఏజెన్సీకి అప్పగించే అవకాశం ఉందని తెలిపారు. రాబోయే రోజుల్లో యాజమాన్యాలకు నిబంధనల అమలును మరింత సరళతరం చేస్తామని, సామాజిక భద్రత కల్పనలో ఈపీఎఫ్ఓపై ఉన్న నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

# "క్రిమినల్ వేస్ట్".. ఇంజినీరింగ్ విద్యార్థులపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో రాజకీయ దుమారం

**ఇంజినీరింగ్ విద్యార్థులపై ముఖ్యమంత్రి "క్రిమినల్ వేస్ట్" వ్యాఖ్యలు**

**ఈ వ్యాఖ్యలతో తెలంగాణలో చెలరేగిన రాజకీయ దుమారం**

**సీఎం వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన బీఆర్ఎస్, బీజేపీ**

**రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని విపక్షాల డిమాండ్**



తెలంగాణలోని ఇంజినీరింగ్ విద్యార్థుల ఉపాధి నైపుణ్యాల గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన 'క్రిమినల్ వేస్ట్' వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ప్రతిఏటా 1.1 లక్షల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ పూర్తి చేస్తున్నప్పటికీ, వారిలో కొందరు కనీసం ఉద్యోగ దరఖాస్తును కూడా నింపలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు."ఇంజినీరింగ్ పట్టభద్రులకు ఒక తెల్ల కాగితం ఇచ్చి అప్లికేషన్ రాయమంటే రాయలేని పరిస్థితి నెలకొంది. ఇది 'క్రిమినల్ వేస్ట్'. ఇంజినీరింగ్ చదివామంటూ చిన్న ఉద్యోగాలకు వెళ్లరు, అదే సమయంలో అవసరమైన నైపుణ్యాలను కూడా అలవర్చుకోరు" అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. రేవంత్ రెడ్డిని "చీప్ మినిస్టర్" అని సంబోధిస్తూ, ఆయన విద్యార్హతలను ప్రశ్నించారు. "రియల్ ఎస్టేట్ బ్రోకర్ స్థాయి నుంచి బ్లాక్‌మెయిలర్‌గా ఎదిగారు" అంటూ ఘాటు విమర్శలు చేశారు. విద్యార్థులపై ఇటువంటి వ్యాఖ్యలు చేయడానికి ముఖ్యమంత్రికి ఉన్న అర్హత ఏంటని కేటీఆర్ ప్రశ్నించారు. తన జీవితంలో రేవంత్ రెడ్డి ఎప్పుడైనా పోటీ పరీక్షలు రాశారా? లేదా ఉద్యోగం కోసం ఇంటర్వ్యూలకు హాజరయ్యారా? ఎక్కడైనా ఉద్యోగం చేశారా? అని ప్రశ్నల వర్షం కురిపించారు.ముఖ్యమంత్రి వ్యాఖ్యలు అత్యంత దురదృష్టకరమని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. తక్షణమే సీఎం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు బీజేపీ నేతలు సైతం ముఖ్యమంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఇది యువతను కించపరచడమేనని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఉద్యోగాల కల్పనతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాజకీయంగా విమర్శలు వెల్లువెత్తడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. తాను విద్యార్థులను విమర్శించలేదని, వారికి సరైన నైపుణ్యాలు అందించడంలో విఫలమవుతున్న విద్యా వ్యవస్థను మాత్రమే ఉద్దేశించానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సైతం ముఖ్యమంత్రికి మద్దతుగా నిలిచారు. విద్యార్థుల్లోని నైపుణ్యాల అంతరాన్ని సరిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి ఉద్దేశమని పేర్కొంటూ కేటీఆర్ విమర్శలను తిప్పికొట్టారు.



## ప్రజావాణి ఫిర్యాదుపై అధికారుల స్పందన.. చిరుమర్తి చెక్‌డ్యాం పరిశీలన

**మాడుగులపల్లి, (జూలై 31) :** మండలంలోని చిరుమర్తి గ్రామంలో చెక్‌డ్యాం ఆక్రమణ, ధ్వంసానికి సంబంధించి ప్రజావాణిలో అందిన ఫిర్యాదుపై జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించింది. ప్రజావాణిలో రైతు సమర్పించిన దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్, మాడుగులపల్లి తహసీల్దార్ సరోజ పావనికి లిఖితపూర్వకంగా విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ సరోజ పావని, ఇరిగేషన్ శాఖ ఏఈఈ వేణుగోపాల్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యామ్, వీఆర్వో రామారావులకు చెక్‌డ్యాం పరిస్థితిని పరిశీలించాలని సూచించారు. అనంతరం అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. విచారణలో చిరుమర్తి గ్రామానికి చెందిన కారింగు సైదులు అనే రైతు చెక్‌డ్యాంను తొలగించి ఆ స్థలాన్ని వ్యవసాయ భూమిగా మార్చుకుని సాగు చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై అధికారులు వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈఈ వేణుగోపాల్ మాట్లాడుతూ, చెక్‌డ్యాంను ధ్వంసం చేసినట్లు తేలితే సంబంధిత వ్యక్తులు గతంలో ఉన్న విధంగానే కట్టను పునరుద్ధరించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెక్‌డ్యాం చుట్టుపక్కల ఉన్న రైతులు మాట్లాడుతూ, ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా వరదనీరు నిలిచి కట్టకు నష్టం జరిగితే సమీపంలోని వ్యవసాయ భూములు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ మోటార్ల వద్దకు వెళ్లేందుకు సరైన దారి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. అందువల్ల చెక్‌డ్యాంను పూర్వస్థితికి తీసుకువచ్చి రైతుల సమస్యలను పరిష్కరించాలని చుట్టుపక్కల రైతులు ఇరిగేషన్ అధికారులను కోరారు. అధికారులు పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## దోమల నివారణలో భాగంగా చండూరు మున్సిపాలిటీలో దోమల మందు పిచికారి.....

**చండూర్:** మున్సిపాలిటీలో గత నాలుగు రోజులుగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ మల్లేశం ఆధ్వర్యంలో మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో దోమల మందు పిచికారి చేయించడం జరిగింది. ఈ సందర్భంగా చండూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామని, పరిసరాలను మాతోపాటు మున్సిపాలిటీ ప్రజల భాగస్వామ్యంతోనే పారిశుద్ధ్యం వైపు అడుగులు వేస్తున్నామని, రోడ్లన్నీ పరిశుభ్రంగా ఉండాలి అంటే ప్రజల యొక్క భాగస్వామ్యం ముఖ్యమని, ప్రజలందరూ సహకరించి పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. వర్షాకాలం రీత్యా పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉంది కాబట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా దోమల బారి నుండి మనకు మనం రక్షించుకోవాలంటే మన ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, కౌన్సిలర్లు మరియు మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు..



## అసంపూర్తిగా ఉన్న నూతన గ్రామ పంచాయతీ భవనం వెంటనే నిర్మించాలి



**మాడుగుల పల్లి (జులై 31)ప్రతినిధి :** ఆగామోత్కూర్ గ్రామంలో అసంపూర్తిగా వదిలేసిన గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని సీపీఎం మండల కమిటీ సభ్యులు పతాని శ్రీను,శాఖ కార్యదర్శి బంటు రాజు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా శుక్రవారం నాడు ప్రారంభ నిర్మాణ దశలోనే అసంపూర్తిగా వదిలేసిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాన్ని గ్రామస్తులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల క్రితం 20 లక్షల రూపాయల నిర్మాణ వ్యయంతో గ్రామ పంచాయతీ నూతన భవనం మంజూరు చేశారు.నిర్మాణం ప్రారంభించిన సమయంలో బేస్ మెంట్ కు ఇసుకకు బదులుగా డస్ట్ వాడుతున్న క్రమంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రశ్నించగా సదరు కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోగా నిర్మాణం అర్ధాంతరంగా నిలిపివేయడం సరికాదన్నారు. ఇప్పటికీ నెలలు గడుస్తున్నా కూడా మేస్త్రిలు,కూలీలు దొరకడం లేదని సాకుతో పట్టించుకోవడం లేదన్నారు.నిత్యం గ్రామస్తులు అనేక అవసరాల రీత్యా వస్తున్న ప్రస్తుత గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకున్నందున నూతన భవనం వెంటనే పూర్తి చేయాలన్నారు.లేని పక్షంలో ఈ విషయం పంచాయతీ రాజ్ శాఖ పై స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని హెచ్చరించారు.వారి వెంట గ్రామస్తులు బంటు సైదులు, కోటయ్య,అంజయ్య,జానయ్య,నాగేష్,బొడ్డ శ్రీను,పల్ల జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు దవాఖానాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

**ఖాళీ డాక్టర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి**

**అవసర సదుపాయాలు కల్పించాలి**

**ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు**



**మిర్యాలగూడ, జూలై 31:- :** పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలంటే సర్కారు దవాఖానలను బలోపేతం చేయడం అత్యవసరమని, రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేసి, అవసర మౌలిక సదుపాయాలు కల్పించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పాలడుగు ప్రభావతి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో శుక్రవారం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన సర్వే అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందాల్సిన వైద్య సేవలు అనేక చోట్ల సిబ్బంది కొరత, మందుల కొరత, పరికరాల లేమి కారణంగా పూర్తిస్థాయిలో అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న తగిన సంఖ్యలో వైద్యులు లేకపోవడంతో రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందన్నారు. అవసర పరీక్షలకు ప్రైవేట్ డయాగ్నస్టిక్ కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, దీంతో పేద ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులకు ప్రత్యేక వైద్య సేవలు మరింత బలోపేతం చేయాలని, అత్యవసర విభాగాలు 24 గంటలు సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రుల్లో అవసరమైన అన్ని రకాల మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని, రక్తపరీక్షలు, స్కానింగ్, ఎక్స్‌రే, ఇతర నిర్ధారణ పరీక్షల కోసం ఆధునిక పరికరాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, రోగులకు పడకలు, ఫ్యాన్లు, తగినంత విద్యుత్, వేచివుండే షెడ్లు, తల్లిపాలు ఇచ్చే గదులు వంటి ప్రాథమిక సౌకర్యాలు మెరుగుపరచాలన్నారు. రోగులు, వారి సహాయకులతో గౌరవప్రదంగా వ్యవహరించేలా సిబ్బందికి తగిన సూచనలు ఇవ్వాలని కోరారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న డాక్టర్లు, నర్సులు, సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు.అవసర మందులు, వైద్య పరికరాలు నిరంతరం అందుబాటులో ఉంచాలన్నారు .అన్ని నిర్ధారణ పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఉచితంగా నిర్వహించాలన్నారు.ఆసుపత్రుల్లో పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, పడకలు తదితర సౌకర్యాలు మెరుగుపరచాలన్నారు.గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు ప్రత్యేక వైద్య సేవలు బలోపేతం చేయాలన్నారు.పేద ప్రజలకు ఉచిత, నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేయాలని, లేకపోతే ప్రజలను సమీకరించి ఐద్వా ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ప్రభావతి హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వ జిల్లా అధ్యక్షులు పోలేబోయిన వరలక్ష్మి జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధన అరుణ సైదమ్మలున్నారు.



# ఆలేరు రెవెన్యూ డివిజన్ కోసం అఖిలపక్ష బంద్ విజయవంతం





ఆలేరు, జూలై 31: ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఆలేరు పట్టణ బంద్ విజయవంతమైంది. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి బంద్‌కు మద్దతు తెలపడంతో పట్టణంలో బంద్ పూర్తిగా విజయవంతంగా సాగింది.బంద్ సందర్భంగా స్థానిక బస్టాండ్ వద్ద రాస్తారోకో, అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ, బీఎస్పీ, అంబేద్కర్ యువజన సంఘం, వ్యాపార సంఘం, మీడియా సంఘం ప్రతినిధులు పాల్గొని ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ, ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంగా ఉన్నప్పటికీ విద్య, వైద్యం, వ్యాపారం, పరిశ్రమల రంగాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని పేర్కొన్నారు. గత ఐదేళ్లుగా రెవెన్యూ డివిజన్ కోసం అనేక ఉద్యమాలు చేపట్టినా ప్రభుత్వం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కూడా ఇదే హామీ ఇచ్చారని, అయితే ఇప్పటి వరకు అమలు చేయలేదని విమర్శించారు.ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో ఉండాల్సిన పలు ప్రభుత్వ కార్యాలయాలు ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయని, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కూడా యాదగిరిగుట్టకు మార్చడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ఆలేరు నియోజకవర్గ ఉనికికే ముప్పు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు.ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తే ఆలేరు, రాజపేట, యాదగిరిగుట్ట, మోటకొండూరు, గుండాల మండలాలతో కలిపి 98 గ్రామాలు పరిధిలోకి వస్తాయని, సుమారు 23 ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పడి ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ సేవల కోసం ఆలేరుకు రావడంతో వ్యాపార, ఆర్థిక కార్యకలాపాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు.రెవెన్యూ డివిజన్ ఏర్పాటు జరిగే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అఖిలపక్ష కమిటీ స్పష్టం చేసింది.ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ కన్వీనర్ పసుపునూరి వీరేశం, కో-కన్వీనర్ చెక్క వెంకటేష్, రాచకొండ జనార్ధన్, వడ్డెమాన్ నరేందర్, పుట్ట మల్లేష్, మొరిగాడి శేఖర్, మొరిగాడి రమేష్, తుంగ కుమార్, చిరిగే శ్రీనివాస్, ఇక్కిరి సహదేవ్, ఇక్కిరి శ్రీనివాస్, ఎలుగల వెంకటేష్, ఎలుగల కుమారస్వామి, చిలుకూరు నర్సిరెడ్డి, పూల హనుమంత్, గంగుల శ్రీనివాస్, కంతుల శంకర్, బేతి కృష్ణహరి, సీహెచ్ ప్రకాష్, కందుల దుర్గేష్, వంగాల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# క్యాన్సర్ కు రోబోటిక్ శస్త్ర చికిత్సలతో అద్భుత ఫలితాలు

### యశోద హాస్పిటల్ సీనియర్ అంకాలజిస్ట్ డాక్టర్ రాజేష్ గౌడ్




**సంగారెడ్డి,జూలై 31:** రోబోటిక్ సర్జరీ సాంకేతిక క్యాన్సర్ చికిత్సలో అద్భుత ఫలితాలు అందిస్తున్నామని యశోద హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ అంకాలజిస్ట్ డాక్టర్ రాజేష్ గౌడ్ తెలిపారు. సంగారెడ్డిలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోబోటక్ విధానంలో అత్యంత మెరుగైన ఆపరేషన్లు నిర్వహించడంతోపాటు రోగులకు నొప్పి రక్తస్రావం కోలుకునే సమయం ఘననీయంగా తగ్గుతుందని వివరించారు. రోబోటిక్ విధానంలో 8 మిల్లీమీటర్ల చిన్న రంధ్రాల ద్వారా శస్త్ర చికిత్సలను నిర్వహించడం వల్ల శరీరంపై గాయాలు తక్కువ ఉంటాయని ఏఐ సాంకేతిక 3డివిజన్ ప్రత్యేక పరికరాలు సాయంతో క్లిష్టమైన క్యాన్సర్ చికిత్సలకు మెరుగైన వైద్యం అంది విజయవంతంచేయగలుగుతున్నామని చెప్పారు. మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ రొమ్ము క్యాన్సర్ పురుషుల్లో పోస్టర్ క్యాన్సర్ కిడ్నీ కొలెస్ట్రాల్ ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్సలో రోబోటిక్స్ సర్జరీ సమర్థవంతంగా ఫలితాలు ఇస్తుందని ముఖ్యంగా నరాలను సంరక్షించడం మూత్రం నియంతన శరీర సామర్థ్యాన్ని కాపాడడంలో ఈ విధానం చాలా ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఫైర్ ఫ్లై ఫ్లోరోసిన్స్ ఇమేజింగ్ సెంటినల్ లింప్ నోట్ మ్యాపింగ్ వంటి అదునిక సాంకేతికలతో క్యాన్సర్ కణాలను మరింత ఖచ్చితంగా గుర్తించే అవకాశం ఉందని తెలిపారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డికి జిన్నారం బీఆర్ఎస్ నాయకుల ఘన నివాళి

### ఆయన మరణం తెలంగాణకు, బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు: రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్ గౌడ్



**జిన్నారం, జూలై 31 :** తెలంగాణ ఉద్యమంలో విశిష్ట సేవలందించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల జిన్నారం బీఆర్ఎస్ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ, పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం తెలంగాణ రాష్ట్రానికి, బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, పార్టీ అభివృద్ధికి ఆయన అందించిన సేవలను కార్యకర్తలు ఎప్పటికీ మరువరని పేర్కొన్నారు. జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్ మాట్లాడుతూ, పెద్ది సుదర్శన్ రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవకు అంకితభావంతో పనిచేయడం ద్వారా ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని అన్నారు. ఈ నివాళి కార్యక్రమంలో జిన్నారం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నాయికోటి రాజేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ గౌడ్, నరేందర్, భ్రమేందర్ గౌడ్, మోహన్, నాగరాజు, దుబాక మహేష్, మంద రమేష్, గణేష్, రాజ్‌కుమార్, రతన్, శ్రీకాంత్, శేఖర్, శ్రీధర్ రెడ్డి, నర్సిములు, మల్లేష్, పాషా, కిషన్, వీరేశంతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

# వరద బాధితులకు అండగా నిలిచిన టీఆర్ఎస్ యూత్ నాయకుడు మారిశెట్టి సుమన్



**లక్షెటిపేట, జూలై 31:** లక్షెటిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఊత్కూర్ 9 వ వార్డ్ లో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షానికి పలువురి ఇండ్లలోకి వరద నీరు చేరడంతో టీఆర్ఎస్ మాజీ యూత్ అధ్యక్షులు మారిశెట్టి సుమన్ బాధితులకు అండగా నిలిచారు. స్థానిక పోచమ్మ గుడి వద్ద నుంచి వరద ప్రవాహం అధికంగా రావడంతో కాలనీలోని కొందరి ఇండ్లలోకి నీరు చేరింది. కల్లె ప్రదీప్ ఇంట్లోకి భారీగా నీరు చేరడంతో రాత్రంతా బిక్కు బిక్కుమంటూ గడిపామని, అధికారులు, స్థానిక నాయకులు సమయానికి ఆదుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు జ్వరంతో బాధపడుతున్నా రన్నారు. యువ నాయకుడు మారిశెట్టి సుమన్ తన స్వంత జేసీబీ ఏర్పాటు చేసి వరద ప్రవాహంతో ఇండ్లు దెబ్బతినకుండా స్థానిక యూత్ సహకారంతో రాత్రి 12 గంటల వరకు డ్రైనేజీ వ్యవస్థ లో చేరుకున్న పూడికను తొలగించారని, స్థానిక కౌన్సిలర్ మాత్రం మా సమస్య పట్ల స్పందించలేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీ వాసులు ఆపదలో ఉన్నప్పుడు ఆదుకోకపోతే మాకు దిక్కేవరూ అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 6 గంటలు కష్టపడి డ్రైనేజీ వ్యవస్థను సరిచేయడం జరిగిందని తెలిపారు. దర్శనాల శ్రీనివాస్ అనే వ్యక్తి ఇంట్లో వరద నీరు నిల్వ ఉండి ఎంతో ఇబ్బందిగా మారిందని తెలిపారు. కాగా, దర్శనాల శ్రీనివాస్ ఇంట్లోకి గతంలో వరద నీరు చేరగా జిల్లా కలెక్టర్ ఆ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్లు సమాచారం. కానీ కొందరు అధికార పార్టీ నాయకులు అతనికి ఇందిరమ్మ ఇల్లు రాకుండా అడ్డుకున్నారని శ్రీనివాస్ ఆరోపించారు. ఏది ఏమైనప్పటికీ 9 వార్డ్ లో ఏటా వరద నీటితో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వరద సహాయక చర్యల్లో యూత్ నాయకులు దర్శనాల వంశీ, రాయలింగు, రమేష్, దేవేందర్, జనార్దన్, బన్నీ, లింగయ్య పాల్గొన్నారు.

# మెదక్ కలెక్టర్‌కు 1000కి పైగా పోస్టుకార్డులు పంపిన రంగాయిపల్లి, చెట్ల గౌరారం గ్రామస్తులు

### 'మా ప్రాణాలు, మా పిల్లల భవిష్యత్తును కాపాడండి' -- ఎంఎస్ అగర్వాల్ కాలుష్య పరిశ్రమను వెంటనే తొలగించాలని డిమాండ్

### గ్రామ ప్రజల పోరాటానికి అండగా ఉంటా -- గజ్వేల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి




మెదక్ జిల్లా మనోహరాబాద్, : మనోహరాబాద్ మండలంలోని రంగాయిపల్లి, చెట్ల గౌరారం గ్రామాల ప్రజలు తమ గ్రామాలను కాలుష్య బారిన పడకుండా కాపాడాలని, తమ ప్రాణాలు, పిల్లల భవిష్యత్తును రక్షించాలని కోరుతూ మెదక్ జిల్లా కలెక్టర్‌కు వెయ్యికి పైగా పోస్టుకార్డులు పంపించారు. "మా ప్రాణాలను, మా పిల్లల ప్రాణాలను కాపాడండి... "మా భవిష్యత్తును రక్షించండి కలెక్టర్ సారూ"...మా ప్రాంతంలో ఉన్న ప్రాణాంతక ఎంఎస్ అగర్వాల్ కాలుష్య పరిశ్రమను వెంటనే తొలగించండి" అనే విజ్ఞప్తితో పోస్టుకార్డులు పంపిస్తూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరై గ్రామ ప్రజలకు సంఘీభావం తెలిపారు. ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమను తొలగించే వరకు ప్రజల పక్షాన నిలబడి ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ, రంగాయిపల్లి, చెట్ల గౌరారం గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో ఏకమై ఎంఎస్ అగర్వాల్ కాలుష్య పరిశ్రమను వెంటనే తొలగించాలని కోరుతూ మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెయ్యికి పైగా పోస్టుకార్డులు పంపడం ప్రజల ఆవేదనకు నిదర్శనమని అన్నారు. ఈ రెండు గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. గ్రామాల్లో వాయు, జల, శబ్ద కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరిందని, ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా గత 20 సంవత్సరాలుగా కాలుష్యం కారణంగా రైతులు తమ పొలాల్లో పంటలు సరిగా పండించుకోలేక ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. పొలాల్లోకి వెళ్లిన రైతులకు విషపూరిత నీటి ప్రభావంతో కాళ్లకు గాయాలు, చర్మవ్యాధులు వస్తున్నాయని, చెరువుల్లో చేపలు పెద్దఎత్తున చనిపోతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారని చెప్పారు. కాలుష్య ప్రభావం మహిళల ఆరోగ్యంపై కూడా తీవ్రంగా పడుతోందని వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గర్భిణులు, యువతులు వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని, గర్భస్రావాలు జరుగుతున్నాయని, కొంతమంది సంతానలేమి సమస్యలను ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు తమకు వివరించారని తెలిపారు. ఇలాంటి పరిస్థితులు మానవ సమాజాన్ని కలిచివేసే అంశాలని పేర్కొన్నారు. ఇంత తీవ్రమైన సమస్యలు ఉన్నప్పటికీ జిల్లా యంత్రాంగం రెండు గ్రామాల ప్రజల పట్ల కనీస స్పందన కూడా చూపకపోవడం దురదృష్టకరమని ఆయన విమర్శించారు. గ్రామస్తులు ఇప్పటికే పలుమార్లు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారని, వందలాది మందితో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాలు నిర్వహించారని, అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రజలలో తీవ్ర నిరాశకు గురిచేస్తోందన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మానవతా దృక్పథంతో స్పందించి రంగాయిపల్లి, చెట్ల గౌరారం గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని, కాలుష్య ప్రభావాన్ని స్వయంగా పరిశీలించి ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమను వెంటనే అక్కడి నుంచి తొలగించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర మీడియాతో పాటు జాతీయ మీడియాను కూడా గ్రామాలకు తీసుకువచ్చి పరిశ్రమ వల్ల జరుగుతున్న కాలుష్యం, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆధారాలతో సహా దేశం ముందుంచుతామని హెచ్చరించారు. సమాచార హక్కు చట్టం ద్వారా అన్ని వివరాలను సేకరించి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా సంబంధిత శాఖలను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. అధికార యంత్రాంగం పరిశ్రమ యాజమాన్యంతో కుమ్మక్కై ప్రజల ప్రాణాలను పణంగా పెడుతోందని ఆరోపించిన ఆయన, లాభాల కోసం రెండు గ్రామాల ప్రజల జీవితాలతో చెలగాటమాడటం దారుణమన్నారు. ప్రజల శాపం అధికారులను వదిలిపెట్టదని హెచ్చరించారు. ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమను తొలగించే వరకు రంగాయిపల్లి, చెట్ల గౌరారం గ్రామాల యువత, రైతులు, మహిళలు ఐక్యంగా పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. తాను ఎల్లప్పుడూ ప్రజలతోనే ఉంటానని, చివరి వరకు న్యాయపోరాటం కొనసాగిస్తానని భరోసా ఇచ్చారు. చివరగా మెదక్ జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి పేద ప్రజల ప్రాణాలను, పిల్లల భవిష్యత్తును కాపాడేలా ఎంఎస్ అగర్వాల్ కాలుష్య పరిశ్రమను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యువకులు, మహిళలు, రైతులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి హోటల్ రోడ్డు భద్రతా కేంద్రంగా మారాలి

### మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

### గోల్డెన్ అవర్‌లో స్పందిస్తే ప్రాణాలు కాపాడవచ్చు

### అలసిపోయిన డ్రైవర్లకు విశ్రాంతి కల్పించడంలో హోటళ్ల భాగస్వామ్యం అవసరం





**మెదక్, జూలై :** జాతీయ రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో హైవే వెంబడి ఉన్న హోటళ్లు, ధాబాలు, రెస్టారెంట్ల యాజమాన్యం కీలక పాత్ర పోషించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు, ఐపీఎస్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో హైవే వెంబడి ఉన్న హోటళ్లు, ధాబాలు, రెస్టారెంట్ల యాజమానులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదం జరిగిన తర్వాత తొలి గంటను"గోల్డెన్ అవర్"గా పేర్కొంటూ, ఆ సమయంలో అందించే తక్షణ వైద్య సహాయం అనేక మంది ప్రాణాలను కాపాడగలదని ఎస్పీ తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే 100, 112 లేదా 108కు సమాచారం అందించి, క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించేలా హోటల్ యాజమాన్యం చొరవ తీసుకోవాలని సూచించారు. హోటల్ సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్, సీపీఆర్ పై శిక్షణ ఇవ్వాలని కోరారు. మెదక్ జిల్లాలో సుమారు 255 కిలోమీటర్ల మేర ఏడు జాతీయ రహదారులు ఉన్నాయని, ఈ మార్గాల్లో భారీ సంఖ్యలో వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయని చెప్పారు. లారీలు, ఇతర భారీ వాహనాల డ్రైవర్లు గంటల తరబడి విశ్రాంతి లేకుండా ప్రయాణించడం వల్ల అలసటకు గురై ప్రమాదాలకు కారణమవుతున్నారని పేర్కొన్నారు. అలసిపోయిన డ్రైవర్లను గుర్తించి కొంతసేపు విశ్రాంతి తీసుకునేలా ప్రోత్సహించాలని, పూర్తిగా అప్రమత్తమైన తర్వాతే ప్రయాణాన్ని కొనసాగించేలా చూడాలని సూచించారు. "ప్రతి రోడ్డు ప్రమాదం వెనుక ఒక కుటుంబం బాధ దాగి ఉంటుంది. ఒక క్షణం నిర్లక్ష్యం జీవితాంతం మానని గాయాన్ని మిగులుస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతను తమ బాధ్యతగా భావించాలి" అని ఎస్పీ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రాహత్ పథకం ద్వారా రూ. 1.5 లక్షల వరకు నగదు రహిత (క్యాష్‌లెస్) వైద్య చికిత్స అందుబాటులో ఉందని వివరించారు. అలాగే గోల్డెన్ అవర్‌లో ప్రమాద బాధితులను ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడేందుకు సహకరించిన వారికి 'రాహ్‌వీర్ పథకం కింద రూ. 25 వేల నగదు ప్రోత్సాహకం అందజేస్తారని తెలిపారు. ప్రమాద బాధితులకు సహాయం చేసిన వారిని గుడ్ సమారిటన్ మార్గదర్శకాల ప్రకారం చట్టపరంగా రక్షిస్తారని స్పష్టం చేశారు. ప్రతి హోటల్, ధాబాలో వాహనాల పార్కింగ్‌కు తగిన స్థలం ఏర్పాటు చేయాలని, పార్కింగ్ సౌకర్యం లేక జాతీయ రహదారులపై భారీ వాహనాలు నిలిపివేయడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. వాహనాలను క్రమపద్ధతిలో పార్కింగ్ చేయించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని సూచించారు. అదేవిధంగా ప్రతి హోటల్, ధాబాలో కనీసం నాలుగు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి అవి నిరంతరం పనిచేసేలా చూడాలని ఆదేశించారు. మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాంటి ఘటనలు గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. "ప్రతి హోటల్ ఒక రోడ్డు భద్రతా కేంద్రంగా మారాలి. అలసటతో ఉన్న డ్రైవర్లకు విశ్రాంతి కల్పించడం, ప్రమాద బాధితులను గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తరలించడం, మహిళల భద్రతను కాపాడడం, మాదకద్రవ్యాలు మరియు అక్రమ కార్యకలాపాలను అరికట్టడంలో పోలీసులకు సహకరించడం ద్వారా అనేక విలువైన ప్రాణాలను కాపాడవచ్చు" అని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, ఏఎంవీఐ, సీఐలు రంగా కృష్ణ, సందీప్ రెడ్డి, వెంకట రాజా గౌడ్, రాజశేఖర్ రెడ్డి, రేణుక, మహేష్, కృష్ణమూర్తితో పాటు జిల్లాలోని హైవే వెంబడి ఉన్న హోటళ్లు, ధాబాలు, రెస్టారెంట్ల యాజమానులు పాల్గొన్నారు.

## పెద్దేవం లో ఆర్.ఆర్. హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**తాళ్లపూడి,జూలై 31:** గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీ ఆర్.ఆర్. మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ ఆర్ రవి కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పెద్దేవం గ్రామంలో ఉచిత వైద్యం శిభిరం ఏర్పాటు చేసారు. సుమారు 150 మందికి పైగా రోగులకు ఉచిత రక్త పరీక్షలు, ఈసీజీ చేసి మందులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గెడ్డం సాయిబాబా, టిడిపి నాయకులు బోడపాటి గంగరాజు, కోడి శంకరం, తిగిరిపల్లి గోపి, ముప్పిడి రాజేష్, గెడ్డం రాధాకృష్ణ, గెడ్డం భాస్కర్, ముప్పిడి రాజేశ్వరరావు, బాల, మేనేజర్ చింటూ, మణికంఠ, పి. ఆర్. ఓస్. సాగర్, వెంకట్, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పేకాట స్థావరంపై దాడి..

## ఏడుగురు అరెస్ట్

**రూ.14,050 నగదు స్వాధీనం చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ఉక్కుపాదం**

**భూపాలపల్లి ప్రతినిధి:** మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో మహదేవ్‌పూర్ లోకల్ ప్రాంతంలో పేకాట నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారాన్ని అందుకున్న పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 14,050 నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ముందస్తు సమాచారంతో ప్రత్యేక బృందం సంఘటనా స్థలానికి చేరుకుని ఆకస్మికంగా తనిఖీలు చేపట్టింది. అక్కడ పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకుని, వారి వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. నిందితులను చట్టపరమైన నిబంధనల ప్రకారం కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా మహదేవ్‌పూర్ ఎస్ఐ మీ. సాంబమూర్తి మాట్లాడుతూ, పేకాట, జూదం, గంజాయి, గుడుంబా తయారీ, కోడిపందేలు, బెట్టింగ్ తదితర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు. ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను అరికట్టేందుకు పోలీస్ శాఖ నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగిస్తోందన్నారు. అదేవిధంగా మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడైనా పేకాట, గంజాయి, గుడుంబా, జూదం, కోడిపందేలు, బెట్టింగ్ లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే 8712658116 నంబర్‌కు లేదా డయల్ 112/100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని పోలీసులు భరోసా ఇచ్చారు.

# భారీ వర్షాల బీభత్సం.. కుప్పకూలిన ఇల్లు

**వాగులు ఉప్పొంగడంతో గ్రామానికి చేరుకోలేని అధికారులు..**

**బాధితులను పరామర్శించిన ప్రజాప్రతినిధులు**

**తాండూర్:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు తాండూర్ మండలంలో బీభత్సం సృష్టిస్తున్నాయి. నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బెజ్జాల గ్రామానికి చెందిన మడవి బుచ్చిరావు నివాస గృహం శుక్రవారం తెల్లవారుజామున సుమారు ఐదు గంటల సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు అప్రమత్తంగా బయటకు రావడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే ఇంట్లోని సామాన్లు, ధాన్యం, గృహోపకరణాలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు స్థానికులు తెలిపారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చేరుకున్న స్థానిక నాయకులు, గ్రామ సర్పంచ్ ప్రభాత్ రావు, ఉపసర్పంచ్ పర్వాత్ రావు, నాయకులు మడవి మాణిక్‌రావు, భగవంత్‌రావు తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరఫున తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భారీ వర్షాలతో గ్రామ పరిసరాల్లోని వాగులు, వంకలు ఉప్పొంగిపోవడంతో రాకపోకలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ కారణంగా రెవెన్యూ అధికారులు, ఇతర శాఖల అధికారులు వెంటనే గ్రామానికి చేరుకోలేని పరిస్థితి ఏర్పడింది. పరిస్థితి సాధారణమైన వెంటనే నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వ సహాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో కురుస్తున్న నిరంతర వర్షాలతో మరికొన్ని పాత ఇళ్లు ప్రమాదకర స్థితిలో ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే గ్రామాన్ని సందర్శించి ప్రమాదకర గృహాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# గోదావరి వరదల నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి అప్రమత్తం

**లోతట్టు ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేయాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశం**

**భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాచలం వద్ద గోదావరి నదికి రెండవ ప్రమాద హెచ్చరిక జారీ అయిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విస్తా కాంప్లెక్స్ స్లూయిస్, గోదావరి కరకట్ట, స్నాన ఘాట్లు, వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి ప్రజల భద్రత కోసం చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, గోదావరిలో వరద ప్రవాహం తీవ్రంగా ఉన్నందున జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గోదావరి స్నాన ఘాట్లు, నదీ తీర ప్రాంతాలు, లోతట్టు గ్రామాలు, ఇతర పర్యాటక ప్రాంతాల్లో గస్తీని మరింత ముమ్మరం చేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలను గోదావరిలోకి అనుమతించవద్దని, సెల్ఫీలు, వీడియోల కోసం ప్రమాద ప్రాంతాలకు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మత్స్యకారుల వివరాలను సేకరించి, వరద ఉధృతి తగ్గే వరకు ఎవరూ నదిలో చేపల వేటకు వెళ్లకుండా హెచ్చరించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న డిడిఆర్ఎఫ్ బృందాలతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

# పల్లె ప్రజల గడపకే నాణ్యమైన వైద్యం.. అదే ప్రభుత్వ సంకల్పం

## మహదేవపూర్ సామాజిక ఆసుపత్రి ఆధునికీకరణకు శ్రీకారం

**మహిళల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక కార్యాచరణ, ఆగస్టు 4న మరో ఉచిత ఆరోగ్య శిబిరం: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**









**భూపాలపల్లి ప్రతినిధి:** మారు మూల గ్రామాల్లో నివసించే ప్రజలకు పట్టణాలకు ఏమాత్రం తీసిపోని వైద్య సేవలు అందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శిధిలావస్థలో ఉన్న మహదేవపూర్ సామాజిక ఆసుపత్రిని ఆధునిక వసతులతో పునర్నిర్మించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటించారు. శుక్రవారం మహదేవపూర్ సామాజిక ఆసుపత్రిలో ఐడీబీఐ బ్యాంకు సహకారంతో ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి, హైదరాబాద్, ఓమెగా ఆసుపత్రి, కరీంనగర్ వైద్యులు నిర్వహించిన ఉచిత క్యాన్సర్, కంటి నిర్ధారణ వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముఖ్యంగా మహిళలను సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకుండా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని, ఇందుకోసం విస్తృత స్థాయిలో పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా పేద కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం తగ్గించవచ్చని, అదే లక్ష్యంతో ఉచిత ఆరోగ్య శిబిరాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు .గ్రామీణ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు హెల్త్ ఏటీఎం, ఈసీజీ, పెరిమీటర్ వంటి ఆధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. హెల్త్ ఏటీఎం ద్వారా 64 రకాల వైద్య పరీక్షలను తక్కువ సమయంలో నిర్వహించవచ్చని, పరీక్షల అనంతరం అందించే హెల్త్ కార్డు ద్వారా ఐదేళ్ల వరకు వైద్య నివేదికలను భద్రపరచుకునే అవకాశం ఉంటుందని వివరించారు. కంటి పరీక్షల కోసం ప్రత్యేక యంత్రాలు, గుండె సంబంధిత వ్యాధులను గుర్తించేందుకు ఈసీజీ పరికరాలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆరోగ్యం, విద్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న మంత్రి, గ్రామీణ ప్రాంతాల్లో కూడా అత్యుత్తమ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుతం శిధిలావస్థలో ఉన్న మహదేవపూర్ సామాజిక ఆసుపత్రిని ఆధునిక ప్రమాణాలతో పునర్నిర్మించి ప్రజలకు మెరుగైన చికిత్స అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సౌకర్యార్థం ఆగస్టు 4న ఎంఎన్‌జే ఆసుపత్రి ఆధ్వర్యంలో మరో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కాటారం డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 680 మందికి హైదరాబాద్‌లో ఉచిత కంటి శస్త్రచికిత్సలు నిర్వహించి చూపు ప్రసాదించామని, మంథని నియోజకవర్గ వ్యాప్తంగా 45 వేల మందికి కంటి పరీక్షలు, చికిత్సలు అందించామని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత ఉపయోగపడే ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆధునిక వైద్య పరికరాలను మంత్రి పరిశీలించారు. వైద్య శిబిరాన్ని విజయవంతం చేసిన వైద్యులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐతా ప్రకాష్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. మధుసూదన్, ఆసుపత్రుల సమన్వయ అధికారి డా. శ్రీకాంత్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజాబాబు, దండు రమేష్, కాటారం ఆర్డీవో రవీందర్, డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపీడీవో రవీంద్రనాథ్, అంకాలజిస్టు డా. సంతోష్ రెడ్డి, సర్పంచ్ హసీనా భాను అక్బర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పంతకాని తిరుమల సమ్మయ్య, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, ఐడీబీఐ మేనేజర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, కాళేశ్వరం దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 15లోపు జలసిరి పనులు పూర్తి చేయాలి

**మహదేవపూర్ మండల స్థాయి సమీక్ష సమావేశంలో నిర్ణయం శాఖల సమన్వయంతో అభివృద్ధి, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి**






భూపాలపల్లి : తెలంగాణ ప్రభుత్వం ప్రతి 45 రోజులకు ఒకసారి మండల స్థాయి సర్వసభ్య సమావేశాలు నిర్వహించాలన్న ఆదేశాల మేరకు శుక్రవారం మహదేవపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి శ్రీ కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వివిధ గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను సమర్పించి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జలసిరి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి గ్రామానికి ఊటకుంట, పంటకుంటలు, బోర్‌వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్ల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి ఆగస్టు 15లోపు పూర్తి చేయాలని నిర్ణయించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని సమావేశంలో సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రతిరోజూ పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఫేజ్--2 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో డీఎల్పీవో మల్లికార్జున్ రెడ్డి, డీఈ సాయిలు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ. రవీంద్రనాథ్, మండల పంచాయతీ అధికారి ప్రకాష్ రెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ చల్లా తిరుపతయ్య, వివిధ గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, కార్యాలయ పర్యవేక్షకులు రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రరూపం దాల్చిన గోదావరి..

## భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ!

## ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గోదావరి ఉగ్రరూపం

## భద్రాచలం వద్ద 44 అడుగులకు చేరుకున్న నీటిమట్టం

## లంక గ్రామాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు



ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. భారీగా వచ్చి చేరుతున్న వరద నీటితో ఈ ఉదయానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 44 అడుగులకు చేరింది. ప్రస్తుతం 9,74,666 క్యూసెక్కుల మేర ప్రవాహం కొనసాగుతుండటంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. వరద ఉద్ధృతికి కల్యాణకట్ట, స్నాన ఘట్టాలు పూర్తిగా నీట మునిగాయి. సాయంత్రానికి నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో లంక గ్రామాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను జిల్లా యంత్రాంగం అప్రమత్తం చేసింది. అవసరమైతే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు రెవెన్యూ, విపత్తు నిర్వహణ బృందాలు సిద్ధంగా ఉన్నాయి. ప్రజలెవరూ గోదావరి వైపు వెళ్లకూడదని అధికారులు హెచ్చరించారు. మరోవైపు తెలంగాణవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు శ్రీరాంసాగర్, మిడ్‌మానేరు, సింగూరు, ఎల్లంపల్లి, జూరాల వంటి ప్రధాన ప్రాజెక్టులన్నీ నిండుకుండలా మారాయి. కాళేశ్వరం వద్ద కూడా గోదావరి నీటిమట్టం 11.29 మీటర్లకు చేరి ప్రమాద స్థాయికి దగ్గరగా ప్రవహిస్తోంది.

# అద్దె ఇళ్ల వారికీ ఊరట

## స్మశానవాటికలో 2 ప్రత్యేక గృహాల నిర్మాణానికి ఎమ్మెల్యే బిఎల్ఆర్ శ్రీకారం





**మిర్యాలగూడ:** అద్దె ఇళ్లలో నివాసముంటూ కుటుంబ సభ్యుల మరణంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచేందుకు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ శుక్రవారం ఒక మానవీయ నిర్ణయం తీసుకున్నారు. పట్టణంలోని హిందూ స్మశానవాటికలో రైస్ మిల్లర్ల సహకారంతో ప్రత్యేకంగా రెండు గృహాలను నిర్మించనున్నట్లు ఆయన సంచలన ప్రకటన చేశారు. మిర్యాలగూడ హిందూ స్మశానవాటికను క్షేత్రస్థాయిలో పరిశీలించిన సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ కీలక నిర్ణయాన్ని ప్రకటించారు. అద్దె ఇళ్లలో ఉంటున్న కుటుంబాల్లో ఎవరైనా అకస్మాత్తుగా చనిపోతే ఇల్లు కీడు అవుతుందనే అంధవిశ్వాసాలతో యజమానులు మృతదేహాన్ని ఇంట్లోకి అనుమతించని సంఘటనలు ఇటీవల ఎంతోమందిని కలచివేశాయ న్నారు. కన్నవారిని, కట్టుకున్నవారిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబాలు, శవాన్ని రోడ్డుపై పెట్టుకుని నరకయాతన అనుభవించిన దయనీయ పరిస్థితులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా ప్రస్తావించారు. ?ఇలాంటి మానవీ య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలనే తపనతోనే స్మశానవాటిక ఆవరణలోనే రెండు సకల సౌకర్యాలతో కూడిన గృహాల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించినట్లు బిఎల్ఆర్ తెలిపారు. మృతదేహాన్ని రోడ్లపై లేదా అనాథగా ఉంచాల్సిన అవసరం లేకుండా, అంతిమ సంస్కారాలు పూర్తయ్యే వరకు గౌరవప్రదంగా గృహాలలో ఉండవచ్చన్నారు. మరణించిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు వేచి ఉండటానికి, ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడానికి ఇళ్లు ఎంతో దోహదపడతాయన్నారు. సామాజిక దృక్పథంతో కూడిన నిర్మాణానికి స్థానిక రైస్ మిల్లర్ల సహకారాన్ని సమీకరించి, త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం స్మశానవాటికలో విపరీతంగా పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను వెంటనే తొలగించి, ఆవరణను ఎప్పటికప్పుడు అద్దంలా శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ అధికారులను గట్టిగా ఆదేశించారు. స్మశానవాటికను అన్ని సౌకర్యాలతో వైకుంఠధామంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే బిఎల్ఆర్ అన్నారు. ?కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



## అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల ఉక్కుపాదం: సీఐ యాలాద్రి

**ఆలేరు, జూలై 31 :** ఆలేరు మండల పరిధిలోని ఆలేరు వాగు, బీకేరు వాగు, ముదుగెలు వాగు, కొలనుపాక వాగుల్లో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై జిల్లా ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు శుక్రవారం ఆకస్మికతనిఖీలునిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా ఇసుక రవాణాచేస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక అశోక్ లేలాండ్ వాహనాన్ని పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ యాలాద్రి మాట్లాడుతూ, పట్టుబడిన వాహనాలపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. ఆలేరు, కొలనుపాక పరిసర ప్రాంతాల్లో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని చెప్పారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎవరూ ఇసుక తవ్వకాలు లేదా రవాణా చేపట్టవద్దని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇసుక రవాణాచేయాలని, నిబంధనలుఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అక్రమ ఇసుక రవాణాలో తొలిసారి పట్టుబడితే రూ.10 వేల జరిమానా, రెండోసారి రూ.20 వేల జరిమానా విధిస్తామని, మూడోసారి పట్టుబడితే సంబంధిత వాహనాలను శాశ్వతంగా సీజ్ చేసే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే సంబంధిత చట్టాల కింద అదనపు కేసులు కూడా నమోదుచేస్తామనిపేర్కొన్నారు. అదేవిధంగా అక్రమ మద్యం విక్రయాలపై కూడా ప్రత్యేక దాడులునిరంతరంకొనసాగుతున్నాయని తెలిపారు. ఎవరైనాప్రభుత్వసహజ వనరులనుఅక్రమంగా దోచుకునేప్రయత్నంచేసి నాచట్టపరంగా కఠినచర్యలుతీసుకుంటామని హెచ్చరించారు.

## వావిళ్లపల్లి పాఠశాలలో ఖాళీ పోస్టులు భర్తీ చెయ్యాలి

### మండల విద్యాధికారికి వినతి పత్రం అందజేసిన

### ఎస్ఎఫ్ఐ నాయకుడు జింకల మహేష్




**సంస్థాన్ నారాయణపూరశీ,** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల వావిళ్లపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చాలా రోజుల నుండి ఖాళీగా ఉన్న ప్రైమరీ టీచర్ ఆయా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు జింకల మహేష్ నారాయణపూర్ మండల విద్యాశాఖ అధికారికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు, ఆయా లేకపోవడం వల్ల విద్యార్థుల బోధన, పాఠశాల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన వివరించారు. సమస్యను సానుకూలంగా పరిశీలించిన ఎంఈఓ సంబంధిత అధికారులతో మాట్లాడి రెండు నుంచి మూడు రోజుల్లో స్పష్టమైన సమాచారం అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల విద్యాభవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని గ్రామస్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి చేయూత..

### రామారం ఎంపీపీఎస్కు రూ.17 వేల విలువైన క్యూ ఎల్ఈడి టీవీ అందించిన కల్వాల నరేష్

### చిన్నారుల డిజిటల్ విద్యకు అండగా నిలిచిన దాత కల్వాల నరేష్

**యాదాద్రి భువనగిరి జిల్లా :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులకు నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో రామారం గ్రామానికి చెందిన కల్వాల నరేష్ తన ఉదారతను చాటుకున్నారు. రామారం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ( ఎంపీపీ ఎస్)లోని ప్రీ-ప్రైమరీ విద్యార్థుల అభ్యాసం కోసం సుమారు రూ.17,000 విలువైన అత్యాధునిక క్యూ ఎల్ఈడి టీవీ ను పాఠశాలకు విరాళంగా అందజేశారు. ఈ టీవీ ద్వారా చిన్నారులు అక్షరాలు, సంఖ్యలు, రైమ్స్, విద్యా వీడియోలు, చిత్రాలు, యానిమేషన్ పాఠాల ద్వారా సులభంగా నేర్చుకునే అవకాశం లభించనుంది. తెలుగు, ఇంగ్లీష్ ఉచ్చారణ మెరుగుపడటంతో పాటు జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెంపొందేందుకు ఇది ఎంతగానో దోహదపడనుంది. పరిశుభ్రత, క్రమశిక్షణ, మంచి అలవాట్లు వంటి విలువలను కూడా ఆకర్షణీయమైన వీడియోల ద్వారా పిల్లలకు బోధించవచ్చని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామపంచాయతీ ప్రతినిధులు, గ్రామ ప్రజలు కల్వాల నరేష్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఇలాంటి సేవాభావంతో మరెందరో దాతలు ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యు. సునీల్ కుమార్, ఎం. సుధాకర్, శ్రావణి, శ్వేత, గ్రామ ఉప సర్పంచ్. ఎలగందుల. నవీన్, కల్వాల.నరేష్, చంద్రగిరి. సుధాకర్ వట్టిపల్లి. సంతోష్ తదితరులు పాల్గొన్నారు



## గురు పౌర్ణమి వేడుకల్లో రమణ గురుస్వామికి ఘన సన్మానం

### అరుణ్ గురు స్వామి ఆశీస్సులతో భక్తుల సమక్షంలో ఆధ్యాత్మిక వేడుకలు

### స్వామి ఆశీర్వాదం పొందిన శిష్య బృందాలు

**బాలానగర్, జులై :** గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆధ్యాత్మిక భక్తి, గురుభక్తి, సంప్రదాయాలకు ప్రతీకగా అత్యంత వైభవంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మాన్యశ్రీ అరుణ్ గురు స్వామి వారి ఆశీస్సులతో రమణ గురు స్వామి వారి స్వగృహంలో, అనంతరం నారాయణ గురు స్వామి వారి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో గురు పూజా కార్యక్రమాలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో శిష్యులు, భక్తులు పాల్గొని గురువుల ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ పార్క్‌లో ప్రత్యేకంగా నిర్వహించిన గురు పౌర్ణమి వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా సాగాయి. బాలానగర్ ఇండస్ట్రియల్ ఏరియాకు చెందిన శిష్య బృందంతో పాటు బీరంగూడ శిష్య బృందం కూడా విచ్చేసి కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. గురువుల పట్ల తమకున్న అపారమైన భక్తిని చాటుతూ రమణ గురు స్వామిని ఘనంగా సన్మానించి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు సమర్పించారు. అనంతరం రమణ గురు స్వామి శిష్యులను ఆశీర్వదిస్తూ, గురువు అనుగ్రహం జీవితానికి మార్గదర్శకమని, గురువు చూపిన సన్మార్గంలో నడిచిన వారికే నిజమైన ఆధ్యాత్మిక పరిపూర్ణత లభిస్తుందని పేర్కొన్నారు. గురు సేవ, భక్తి, వినయం, క్రమశిక్షణ ప్రతి శిష్యుడు జీవితంలో అలవరచుకోవాలని సూచించారు. శిష్యులు మాట్లాడుతూ, గురు పౌర్ణమి రోజున గురువులను స్మరించడం భారతీయ సంస్కృతిలో అత్యంత పవిత్రమైన సంప్రదాయమని, గురువు ఆశీస్సులతోనే జీవితంలో విజయాలు, శాంతి, ఆధ్యాత్మిక వికాసం సాధ్యమవుతాయని తెలిపారు. ప్రతి సంవత్సరం ఇదే విధంగా గురు పౌర్ణమి వేడుకలను నిర్వహిస్తూ గురుభక్తిని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ ఇండస్ట్రియల్ ఏరియా శిష్య బృందం, బీరంగూడ శిష్య బృందం, భక్తులు, శిష్యులు, ఆధ్యాత్మిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని గురువులకు వందనాలు సమర్పించి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం మొత్తం భక్తి, ఆధ్యాత్మికత, గురు మహిమను చాటిచెప్పేలా ఎంతో వైభవంగా జరిగింది.

## ఏఎస్ఐ ప్రభాకర్ సేవలు అభినందనీయం: ఇన్చార్జి సీఐ మంజుల




మిర్యాలగూడ, జూలై: పోలీసు శాఖలో వివిధ హోదాల్లో సుమారు మూడున్నర దశాబ్దాల పాటు సేవలందించిన ఏఎస్ఐ నందిపాటి ప్రభాకర్ సేవలు అభినందనీయమని షీ టీం ఇన్చార్జి సీఐ మంజుల అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ లోఏర్పాటు చేసిన ప్రభాకర్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ శాంతిభద్రతలు, షీ టీం విభాగంలో ప్రభాకర్ నిబద్ధత, అంకితభావంతో ఆయన అందించిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. పోలీసు శాఖలో నిజాయితీగల ఉద్యోగిగా పలువురి మన్ననలు పొందిన ఆయన ఉద్యోగ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పోలీసింగ్ చక్కటి నిర్వచనం ఆయన సేవ నిరతి అని పోలీసు అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను విద్యుక్త ధర్మంతో సమాజ హితం కొరకు పోలీస్ సేవలు అందించిన ఆయన పలువురికి ఆదర్శప్రాయుడన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న ప్రభాకర్ మాట్లాడుతూ తన విధి నిర్వహణలో తనకు సహకరించిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను పూలమాలలు శాలవాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో షీ టీం ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ తబిత, హెడ్ కానిస్టేబుల్ మౌజం హుస్సేన్, మట్టయ్య, కానిస్టేబుల్స్ రాజేశ్వరి, యాస్మిన్, హోంగార్డ్స్ రవి, మధు, అయూబ్ లున్నారు.

# ఖర్జూరం గింజల కాఫీ.. నో కెఫీన్.. రుచికరం, ఆరోగ్యం.. ఇలా ప్రిపేర్ చేసుకోండి



మనం రకరకాల కాఫీలు తాగుతాం. అవన్నీ కాఫీ గింజలతో తయారయ్యేవి. కానీ ఎప్పుడైనా ఖర్జూరం గింజలతో చేసిన కాఫీ తాగారా? చాలా బాగుంటుంది. దీని వల్ల ప్రత్యేక ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ఈ కాఫీ ఎలా చెయ్యాలో తెలుసుకోండి. ఖర్జూరం గింజల్ని పారేస్తున్నారా? ఆ గింజలే మీకు సూపర్ కాఫీ ఇస్తాయి! హైదరాబాద్‌లో ఉదయం కాఫీ తాగకుండా రోజు మొదలు పెట్టడం ఎంత కష్టమో మనకు తెలుసు. కానీ కాఫీ లోని కెఫీన్ వల్ల నిద్ర సరిగా పట్టదు. గుండెలో బరువు, ఏసీడిటీతో ఇబ్బంది పడేవాళ్లు చాలా మంది ఉన్నారు. అందుకే ఇప్పుడు ఒక సూపర్ ఆల్టర్నేటివ్ ఉంది. అదే ఖర్జూరం గింజల కాఫీ! ఖర్జూరం గింజల్ని వేయించి, పొడి చేసి, కాఫీలా తయారు చేసుకోవచ్చు. ఇందులో కెఫీన్ ఉండదు. రుచి నట్స్ తిన్నట్లుగా బాగుంటుంది, ఆరోగ్యానికి ఎన్నో లాభాలు ఉన్నాయని ప్లాంట్ యూ రిపోర్ట్ చేసింది. ఖర్జూరం గింజల కాఫీ పొడిని మనం ఆన్‌లైన్‌లో కొనుక్కోవచ్చు. 100 గ్రాముల ప్యాకెట్ సుమారు రూ.200 ఉంటుంది. మనీ సేవ్ చేసుకోవాలి అనుకుంటే, ఇంట్లోనే సొంతంగా చేసుకోవచ్చు. సాధారణంగా మనం ఖర్జూరం తిని, గింజల్ని పారేస్తాం. అవి గట్టిగా ఉంటాయి. వేస్ట్ అనుకుంటాం. కానీ ఇప్పుడో కొత్త ట్రెండ్ మొదలైంది. ఆ గింజల్ని సరైన పద్ధతిలో వేయించి గ్రైండ్ చేస్తే అద్భుతమైన కాఫీ పొడి వస్తుంది. ఇది కెఫీన్ ఫ్రీ అయినందున ఎవరైనా తాగవచ్చు. గర్భిణీలు, బీపీ, షుగర్, ఇన్సోమ్నియా ఉన్నవాళ్లు కూడా వాడొచ్చని చీణుఎ రిపోర్ట్ చేసింది. ఈ కాఫీలో యాంటీఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. బాడీలో చెడు వ్యర్థాల్ని తొలగిస్తాయి. ఫైబర్ ఎక్కువ కాబట్టి జీర్ణక్రియ మెరుగవుతుంది, మలబద్ధకం సమస్య తీరుతుంది. బ్లడ్‌లో షుగర్ లెవెల్స్ కంట్రోల్ అవుతాయి. డయాబెటిక్ పేషెంట్లకు మంచిదని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ కాఫీ.. గుండె, లివర్, కిడ్నీలను కాపాడుతుంది. ఇది – జీరో వేస్ట్ లాంటిది. ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు, ఖర్చు దాదాపు లేనట్లే. రుచి మాత్రం.. డ్రై ఫ్రూట్స్ తిన్నట్లుగా.. నట్టీగా.. కొద్దిగా తియ్యగా.. సాధారణ కాఫీలాగానే అనిపిస్తుంది. ఏ ఆహారమైనా పాజిటివ్ ఉన్నట్లే, నెగెటివ్ అంశాలూ ఉంటాయి. ఖర్జూరం గింజల కాఫీని ఎక్కువగా తాగితే జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. గింజల్ని సరిగా క్లీన్ చేయకపోయినా లేదా ఓవర్ రోస్ట్ చేస్తే రుచి పాడవుతుంది. ఒక చిన్న కేస్ స్టడీలో ఈ కాఫీకీ, పోర్టల్ వైన్ థ్రాంబోసిస్‌కీ సంబంధం ఉండవచ్చని చెప్పారు. కాబట్టి ఈ కాఫీ తాగేముందు.. తాగాలో, వద్దో డాక్టర్ సలహా తీసుకోవాలి. ఐతే.. నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ కాఫీని కొద్ది మోతాదులో తాగితే మంచిదే. మరి దీన్ని ఎలా తయారుచేసుకోవాలో చూద్దాం. సుమారు 15 నుంచి 30 ఖర్జూరం గింజలు తీసుకోండి. ఓవెన్ లేదా స్టవ్ కడాయి, కాఫీ గ్రైండర్ లేదా మిక్సీ ఉండాలి. ఎలా చెయ్యాలంటే.. ముందుగా గింజల్ని నీళ్లతో బాగా కడగండి. ఖర్జూరం గుజ్జు, పొర అంటుకుని ఉంటే పూర్తిగా తీసేయండి. తర్వాత 1, 2 రోజులు గాలిలో, ఎండలో ఆరబెట్టండి. తర్వాత ఓవెన్‌లో 180-200ీజ (350-400ీఫీ) దగ్గర 25 నుంచి 45 నిమిషాలు వేయించండి. లేదా కడాయిలో మీడియం ఫ్లేమ్ మీద నిరంతరం కదుపుతూ వేయించండి. డార్క్ బ్రౌన్ అయ్యే వరకు, కాఫీ వాసన వచ్చే వరకూ వేయించండి. తర్వాత పూర్తిగా చల్లారనివ్వండి. కాఫీ గ్రైండర్ లేదా మిక్సీలో.. ఫైన్ పౌడర్‌గా గ్రైండ్ చేయండి. ఎయిర్‌టైట్ జార్‌లో నిల్వ చేయండి. 2 నుంచి 4 వారాలు తాజాగా ఉంటుంది. 1 నుంచి 2 టీస్పూన్ల పౌడర్‌ని వేడి నీళ్లలో వేసి 5 నుంచి 10 నిమిషాలు ఉడకనివ్వండి. ఇప్పుడు ఫిల్టర్ చెయ్యండి. అందులో ఆల్రెడీ కాచిన, వేడి పాలను పోసి, పంచదార కలిపి తాగవచ్చు. కొంతమంది చక్కెర బదులు ఖర్జూర సిరప్ కలుపుకుంటారు.



# పిల్లల పెంపకంలో మీరు చేసే పెద్ద తప్పు ఇదే..

పిల్లలకు కార్లు, బస్సులు, కాస్ట్లీ స్కూల్ ఫీజులు కడితే సరిపోతుందా? వసతులు కల్పించినా చదువులో వెనుకబడే పిల్లల వెనుక ఉన్న ఆ కోతి కథా సీక్రెట్, వారిని సక్సెస్ బాటలో నడిపించే పక్కా లేటెస్ట్ పేరెంటింగ్ టిప్స్ ఇప్పుడు తెలుసుకోండి... ప్రస్తుత పోటీ ప్రపంచంలో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లల చదువు, భవిష్యత్తు విషయంలో విపరీతమైన ఆందోళనకు గురవుతుంటారు. పక్కింటి పిల్లవాడు క్లాస్ ఫస్ట్ వచ్చినా, చుట్టాల అబ్బాయి పెద్ద ఉద్యోగం సంపాదించినా.. వెంటనే తమ పిల్లలను వారితో పోల్చడం మొదలుపెడతారు. "నీకు అన్ని వసతులు కల్పించాను, మంచి స్కూల్లో సీటు ఇప్పించాను, ఫీజులు కట్టాను, అయినా నువ్వెందుకు సాధించలేకపోతున్నావు?" అంటూ పిల్లలపై మానసిక ఒత్తిడిని పెంచుతుంటారు. అయితే పిల్లల విజయం అనేది కేవలం వసతులు కల్పించడం వల్ల మాత్రమే రాదని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ శైలజ స్పష్టం చేస్తున్నారు. దీని వెనుక తల్లిదండ్రులు చేయాల్సిన అసలైన కృషి ఎంత ఉందో ఒక చిన్న ఆసక్తికరమైన కథ ద్వారా ఇప్పుడు క్లియర్ గా తెలుసుకుందాం. చేపలు పట్టేవాడు – కోతి కథ... ఒక ఊరిలో ఒక చేపలు పట్టే వ్యక్తి ఉండేవాడు. అతను చాలా నైపుణ్యంతో, ఒడుపుగా తన వలని గుండ్రంగా నీటిలోకి విసిరేవాడు. కొంతసేపటి తర్వాత వలను పైకి లాగగా.. అందులో ఎన్నో అందమైన, వెండి రంగులో మెరిసిపోయే చిన్న చిన్న చేప పిల్లలు దొరికాయి. వాటన్నిటినీ బుట్టలో వేసుకుని అతను విశ్రాంతిగా పడుకున్నాడు. ఈ దృశ్యాన్ని చెట్టు మీద ఉన్న ఒక కోతి గమనించింది. అది మనసులో ఇలా అనుకుంది: "ఆ మనిషి లాగే నాకు కూడా రెండు చేతులు ఉన్నాయి కదా! నేను కూడా వలని అలా విసిరి సులభంగా చేపలను పట్టేయగలను." ఆ మనిషి నిద్రిస్తున్న సమయంలో కోతి మెల్లగా కిందకు దిగి, వలను తీసుకుంది. అయితే దానికి వల వేయడం తెలియకపోవడంతో, వలను అటు ఇటు తిప్పి విసిరేసరికి అది తిరిగి దానికే చుట్టుకుపోయింది. కోతి అందులో నుంచి బయటపడటానికి ఎంత తన్నుకుందో.. అంత గట్టిగా వలలో చిక్కుకుపోయింది. అప్పుడే నిద్ర లేచిన ఆ మనిషి కోతిని చూసి, దానిని వల నుండి విడిపించాడు. తల్లిదండ్రులు గమనించాల్సిన 5 పక్కా పేరెంటింగ్ నియమాలు.. కేవలం డబ్బు సంపాదించి, వస్తువులను సమకూర్చితే సరిపోదు. మీ పిల్లలు భవిష్యత్తులో పెద్ద విజయాలు సాధించాలంటే తల్లిదండ్రుల వైపు నుండి కింది 5 రకాల సాధన, కృషి ఎంతో అవసరం. చిన్నప్పటి నుంచి పిల్లలతో కలిసి కూర్చోవడం అలవాటు చేసుకోవాలి. వారి దైనందిన కార్యకలాపాలలో భాగస్వాములు కావాలి. నిలకడ నేర్పడం: పిల్లలకు చిన్నతనం నుంచే ఏ పనిపైనైనా నిలకడ, ఏకాగ్రత వచ్చేలా శిక్షణ ఇవ్వాలి. ఇందుకోసం వారితో బ్రెయిన్ పజిల్స్ లాంటి ఆటలను ఆడించాలి. వారితో క్రమం తప్పకుండా ప్రతిరోజూ మాట్లాడాలి. వారి మనసులో ఏముందో, వారు పడుతున్న ఇబ్బందులు ఏంటో ప్రేమగా అడిగి అర్థం



# బ్లూ చీజ్‌లో ఫంగస్ ఎందుకు ఉంటుంది..? కుళ్ళిపోయినట్లుగా ఉన్న ఎందుకు ఇష్టంగా తింటారు..?



మొజరెల్లా, చెడ్డార్ , ఫెటా వంటి చీజ్ రకాలతో పాటు, ఆకుపచ్చ-నీలం రంగు గీతలు లేదా చారలతో ప్రత్యేకంగా కనిపించే 'బ్లూ చీజ్' కూడా మార్కెట్‌లో లభిస్తుంది. పిజ్జాలో అయినా, శాండ్‌విచ్‌లలో అయినా చీజ్‌ను ఎంతో ఇష్టంగా తింటారు. మొజారెల్లా, చెడ్డార్, రికోటా, ఫెటా , కాటేజ్ చీజ్ వంటి అనేక రకాల చీజ్‌లు ఉన్నాయి. వాటిలో ప్రతిదానికీ దాని ప్రత్యేకమైన రుచి ఉంటుంది. అయితే మార్కెట్లో "బ్లూ చీజ్" కూడా లభిస్తుందని మీకు తెలుసా? ఇది పసుపు రంగులో ఉండి, దానిపై ఆకుపచ్చ-నీలి రంగు మచ్చలు ఉంటాయి. ఈ ప్రత్యేకమైన రంగు శిలీంధ్రం (ఫంగస్) వల్ల వస్తుంది. అయితే దీని అర్థం చీజ్ శిలీంధ్రం వల్ల పాడైపోయిందా? ప్రజలు ఈ చీజ్‌ను అంతగా ఇష్టపడి తినడానికి కారణం ఏమిటి? ఇక్కడ తెలుసుకోండి. బ్లూ చీజ్ తన ప్రత్యేకమైన ఆకృతి, రంగును నుండి పొందుతుంది. ఇవి తినదగిన శిలీంధ్రాల రకాలు. ఈ కథనం న్యూస్18 గుజరాత్ నుండి సేకరించబడింది. ఈ ప్రత్యేకమైన రంగు శిలీంధ్రం (ఫంగస్) వల్ల వస్తుంది. అయితే దీని అర్థం చీజ్ శిలీంధ్రం వల్ల పాడైపోయిందా? ప్రజలు ఈ చీజ్‌ను అంతగా ఇష్టపడి తినడానికి కారణం ఏమిటి? ఇక్కడ తెలుసుకోండి. బ్లూ చీజ్ తన ప్రత్యేకమైన ఆకృతి, రంగును బట్టి పొందుతుంది. ఇవి తినదగిన శిలీంధ్రాల రకాలు. ఈ కథనం న్యూస్18 గుజరాత్ నుండి సేకరించబడింది. చీజ్ తయారీదారులు బ్లూ చీజ్ తయారీ ప్రక్రియలోనే ఈ శిలీంధ్రాన్ని ప్రవేశపెడతారు. దీనివల్ల చీజ్‌లోపల బూజు పెరుగుతుంది. ఈ శిలీంధ్రం చీజ్‌ను పాడుచేయకపోగా అందులోని కొవ్వులను, ప్రోటీన్లను విచ్ఛిన్నం చేసి, చీజ్‌కు దాని క్రీములాంటి ఆకృతిని, రుచిని అందిస్తుంది. బ్లూ చీజ్ ఉప్పగా, పుల్లగా ఉంటూ, మట్టి వాసనతో పాటు కొద్దిగా ఘాటైన రుచులను కలిగి ఉంటుంది. మొదట దీని రుచి కొంచెం వింతగా అనిపించవచ్చు. కానీ నాలుకకు అలవాటయ్యాక ప్రజలు దానిని ఇష్టపడటం ప్రారంభిస్తారు. బ్లూ చీజ్‌ను నేరుగా తినవచ్చు లేదా సలాడ్‌లు, పాస్తాలలోనూ, అలాగే తేనె , ఎండిన పండ్లతో కలిపి కూడా ఆస్వాదించవచ్చు. ఇది సాధారణ వంటకాలకు కూడా ఒక ప్రత్యేకమైన రుచిని జోడిస్తుంది. బ్లూ చీజ్ పోషకాలతో సమృద్ధిగా ఉంటుంది. ఇందులో కాల్షియం, ప్రోటీన్ , విటమిన్- దీ12 ఉంటాయి. ఈ చీజ్ జీర్ణకోశ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఇందులో ఉండే ప్రోబయోటిక్స్‌కు కూడా ఇది ప్రసిద్ధి చెందింది. బ్లూ చీజ్ చెఫ్‌లకు ఎంతో ఇష్టమైనది ఎందుకంటే దీనిని అతి తక్కువ శ్రమతో ఏ వంటకం రుచిని అయినా మెరుగుపరచడానికి ఉపయోగించవచ్చు.

# పార్లర్‌కు వెళ్లకుండానే ఇంట్లోనే బ్యూటీ డిటాక్స్.. వీకెండ్‌లో ఈ చిన్న పనులు చేయండి!



వీకెండ్‌లో ఇంట్లోనే సులభంగా చేయగల బ్యూటీ డిటాక్స్ చిట్కాలతో చర్మం, జుట్టుకు సహజమైన మెరుపును తీసుకురండి. డబుల్ క్లెన్సింగ్, ఫేస్ మాస్క్, హెయిర్ కేర్, మంచి నిద్ర వంటి అలవాట్లు మీ అందాన్ని మరింత మెరుగుపరుస్తాయి. వారం మొత్తం పని ఒత్తిడి, కాలుష్యం, మేకప్, ఎండ ప్రభావంతో చర్మం, జుట్టు తమ సహజ కాంతిని కోల్పోతాయి. అలాంటి సమయంలో వీకెండ్‌లో కొద్దిసేపు కేటాయించి సులభమైన బ్యూటీ డిటాక్స్ పాటిస్తే చర్మం తాజాగా, జుట్టు ఆరోగ్యంగా మారుతుంది. ఖరీదైన పార్లర్ ట్రీట్‌మెంట్లు అవసరం లేకుండానే ఇంట్లోనే ఈ చిట్కాలను అనుసరించి అందాన్ని మరింత పెంచుకోవచ్చు. వారం మొత్తం సన్‌స్క్రీన్, మేకప్ ఉపయోగించి ఉంటే ముందుగా ఆయిల్ బేస్డ్ క్లెన్సర్ లేదా క్లెన్సింగ్ బామ్‌తో ముఖాన్ని శుభ్రం చేయండి. అనంతరం మైల్డ్ ఫేస్‌వాష్‌తో మరోసారి కడిగితే దుమ్ము, మురికి, అదనపు నూనె పూర్తిగా తొలగిపోతాయి. దీంతో చర్మం తాజాగా కనిపిస్తుంది. చర్మంపై పేరుకుపోయిన మృత కణాలను తొలగించేందుకు వారానికి ఒక్కసారి మాత్రమే మైల్డ్ స్క్రబ్ లేదా మీ చర్మానికి సరిపోయే కెమికల్ ఎక్స్‌ఫోలియంట్ ఉపయోగించండి. గట్టిగా రుద్దడం వల్ల చర్మానికి చికాకు కలిగే అవకాశం ఉంటుంది కాబట్టి జాగ్రత్తగా చేయాలి. కొబ్బరి నూనె, బాదం నూనె లేదా అర్గాన్ ఆయిల్‌ను స్వల్పంగా వేడి చేసి తలకు, జుట్టుకు బాగా మసాజ్ చేయండి. కనీసం 30 నిమిషాల తర్వాత షాంపూతో తలస్నానం చేస్తే జుట్టు మృదువుగా, ఆరోగ్యంగా ఉంటుంది. జుట్టు ఎక్కువగా పొడిబారితే హెయిర్ మాస్క్ కూడా ఉపయోగించవచ్చు. అందరూ ఎక్కువగా ముఖంపైనే శ్రద్ధ పెడతారు. కానీ పెదవులు, చేతులకు కూడా సంరక్షణ అవసరం. లిప్ స్క్రబ్‌తో మృత కణాలను తొలగించి మంచి లిప్ బామ్ రాయండి. చేతులకు మాయిశ్చరైజింగ్ హ్యాండ్ క్రీమ్ ఉపయోగించడం వల్ల పొడిబారడం తగ్గుతుంది. ఆరోగ్యకరమైన చర్మానికి తగినంత నీరు తాగడం చాలా ముఖ్యం. రోజంతా ఎక్కువ నీరు తాగడంతో పాటు దోసకాయ, పుచ్చకాయ వంటి నీటి శాతం అధికంగా ఉండే రోజుకు 7 నుంచి 8 గంటల నాణ్యమైన నిద్ర శరీరానికి, చర్మానికి ఎంతో అవసరం. నిద్ర సమయంలో చర్మ కణాలు పునరుద్ధరణ చెందుతాయి. దీంతో మరుసటి రోజు ముఖం మరింత తాజాగా, కాంతివంతంగా కనిపిస్తుంది. సీజనల్ పండ్లు, తాజా కూరగాయలు, ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల చర్మం, జుట్టు ఆరోగ్యంగా ఉంటాయి. బయటి సంరక్షణతో పాటు లోపలి పోషణ కూడా సమానంగా అవసరం. వీకెండ్‌లో ఈ చిన్న చిన్న బ్యూటీ డిటాక్స్ అలవాట్లను పాటిస్తే ఖరీదైన ట్రీట్‌మెంట్లు లేకుండానే చర్మం, జుట్టు ఆరోగ్యంగా, కాంతివంతంగా మారతాయి. కొద్దిపాటి సమయాన్ని మీ కోసం కేటాయించడం ద్వారా సహజమైన అందాన్ని మరింత మెరుగుపరుచుకోవచ్చు.



నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక



'ధమాకా' తర్వాత హీరోయిన్ గా శ్రీలీల ఖాతాలో ఒక్క హిట్టు కూడా పడలేదు. బాలకృష్ణ- అనిల్ రావిపూడి కాంబినేషన్లో వచ్చిన 'భగవంత్ కేసరి' హిట్ అయినా.. అందులో శ్రీలీల హీరోయిన్ కాదు. అయినప్పటికీ దాని సక్సెస్ క్రెడిట్ శ్రీలీల ఖాతాలో పడలేదు.'స్కంద' 'ఆదికేశవ' 'ఎక్స్ట్రా ఆర్డినరీ మెన్' 'గుంటూరు కారం' 'రాబిన్ హుడ్' 'జూనియర్' 'మాస్ జాతర' 'పరాశక్తి' ఇలా అన్నీ డిజాస్టర్లే. వేరే హీరోయిన్ ట్రాక్ రికార్డు ఇలా ఉంటే.. ఈపాటికి దుకాణం సర్దేసేది. కానీ శ్రీలీల ఆ విషయంలో లక్కీ అనే

## కోటి రూపాయలు పారితోషికం అందుకుంటుంది

చెప్పాలి. ఇన్ని డిజాస్టర్లు పడినప్పటికీ.. ఆమె డిమాండ్ ఏమీ తగ్గలేదు. ఇప్పటికీ ఆమె కోటి రూపాయలు పారితోషికం అందుకుంటుంది. ప్రస్తుతం ఆమె హిందీలో 2 సినిమాల్లో నటిస్తుంది.అవి రెండూ క్రేజీ ప్రాజెక్టులే. మరోవైపు తమిళంలో క్రేజీ ఆఫర్లు అందుకుంటుంది. ధనుష్ 50వ సినిమాలో సాయి పల్లవితో పాటు మరో హీరోయిన్ గా నటిస్తుంది. అలాగే అజిత్ హీరోగా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాలో కూడా హీరోయిన్ గా నటిస్తుంది.మరోవైపు పవన్ కళ్యాణ్ కి జోడీగా 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాలో నటించింది. హరీష్ శంకర్ దర్శకత్వం వహించిన సినిమా అది. మార్చి 26న రిలీజ్ అవుతుంది.



# రూమర్లపై కౌంటర్ ఇచ్చిన మీనా

తనపై వస్తున్న అనవసర రూమర్లకు ఈసారి గట్టిగానే కౌంటర్ ఇచ్చారు సీనియర్ హీరోయిన్ మీనా. చాలా కాలం పాటు దక్షిణ భారత సినీ పరిశ్రమలో అగ్ర కథానాయికగా వెలుగొందిన మీనా, తాజాగా సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న తప్పుడు కథనాలపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎప్పుడూ వివాదాలకు దూరంగా ఉండే మీనా, ఈసారి మాత్రం తన సహనాన్ని పరీక్షిస్తున్నారని స్పష్టంగా చెప్పుకొచ్చారు. చైల్డ్ ఆర్టిస్ట్‌గా కెరీర్ ప్రారంభించి, ఆపై హీరోయిన్‌గా స్టార్ స్టేటస్ అందుకున్న మీనా. సీతారామయ్య గారి మనవరాలు, చంటి, అబ్బాయిగారు, అల్లరి అల్లుడు, ముత్తు వంటి చిత్రాలతో ప్రేక్షకుల మనసుల్లో శాశ్వత స్థానం సంపాదించారు. ఇప్పటికీ క్యారెక్టర్ రోల్స్, కీలక పాత్రలతో తన సెకండ్ ఇన్నింగ్స్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్నారు.అయితే ఇటీవల మీనా రెండో పెళ్లి చేసుకోబోతున్నారంటూ వస్తున్న కథనాలు ఆమెను తీవ్రంగా కలచివేశాయట. వ్యక్తిగత జీవితంలో ఇప్పటికే పెద్ద విషాదాన్ని ఎదుర్కొన్న మీనా, మళ్లీ ఇలాంటి అసత్య ప్రచారాలు తనను మానసికంగా బాధిస్తున్నాయని తెలిపారు. "నిజం ఏంటో తెలుసుకోకుండా, మీ ఇష్టం వచ్చినట్లు కథలు అల్లడం ఎంతవరకు కరెక్ట్ ?" అంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఒక ఒంటరి మహిళనని, అంతేకాదు ఒక కుమార్తె తల్లినని గుర్తుచేశారు.

ఈ వార్తలు తన కూతురు చూసినప్పుడు ఆమె మనసుపై ఎలాంటి ప్రభావం పడుతుందో ఆలోచించాలంటూ మీడియా, సోషల్ మీడియాను కోరారు.ఇలాంటి రూమర్లకు స్పందించి తన సమయం, ఆరోగ్యం, ఎనర్జీని వృథా చేసుకోవాలని తనకు లేదని, పాజిటివ్‌గా జీవించడమే తన లక్ష్యమని మీనా స్పష్టం చేశారు. "కర్మ అనేది ఉంటుంది అని అది ఎవరినీ వదిలిపెట్టదు" అనే ఆమె మాటలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. మొత్తానికి ఎప్పుడూ సైలెంట్‌గా ఉండే మీనా ఇలా ఫైర్ అవ్వటం చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. ఇకనైనా ఇలాంటి తప్పుడు ప్రచారాలు ఆగిపోవాలని ఆమె స్పష్టమైన హెచ్చరిక ఇచ్చినట్టే భావించాలి.

# భార్యపై ప్రేమను చాటుకున్న నిక్ జోనస్

తన భార్య, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా సంస్కృతిని గౌరవిస్తూ ఆయన చేసిన ఈ పని ఇప్పుడు నెటిజన్ల మనసు గెలుచుకుంటోంది. పురుషులు కూడా ఇలా చేయవచ్చా? అని అందరూ ఆశ్చర్యపోయేలా చేసిన ఆ విశేషాలేంటో చూద్దాం.. ఆయన ఒక గ్లోబల్ మ్యూజిక్ ఐకాన్. ఆమె ప్రపంచం మెచ్చిన భారతీయ నటి. వీరిద్దరి జోడీ అంటేనే ఒక సెలబ్రేషన్. తాజాగా ఆ పాప్ సింగర్ తన భార్య నటిస్తున్న 'ద బ్లఫ్' సినిమాలోని 'బ్లడీ మేరీ' పాత్రకు గుర్తుగా ఒక కాక్టెయిల్ తయారు చేస్తున్న వీడియోను షేర్ చేశారు. అయితే, అందరి దృష్టి ఆ కాక్టెయిల్ మీద కంటే ఆయన మణికట్టుపై ఉన్న ఒక నల్లపూసల గొలుసు మీదకు వెళ్లింది. హిందూ సంప్రదాయంలో కేవలం మహిళలు మాత్రమే ధరించే మంగళసూత్రాన్ని ఆయన బ్రాస్‌లెట్ రూపంలో ధరించడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఆ పాప్ స్టార్ మరెవరో కాదు.. నిక్ జోనస్. సాధారణంగా మంగళసూత్రం అంటే వివాహితలకు చిహ్నం. నల్లపూసలు, బంగారు సూత్రాలతో ఉండే ఈ పవిత్ర బంధం ఇప్పుడు ఫ్యాషన్ ప్రపంచంలో కొత్త పుంతలు తొక్కుతోంది. గతంలో సోనమ్ కపూర్ తన రాశి చక్రంతో కూడిన మంగళసూత్రాన్ని ఎంచుకోగా, ఆలియా భట్ తన హారంలో ఇన్ఫినిటీ గుర్తును చేర్చుకుంది. రాధికా మర్చంట్ సైతం తన మంగళసూత్రాన్ని బ్రాస్‌లెట్‌గా ధరించి ఆశ్చర్యపరిచింది. అయితే, ఇప్పుడు నిక్ జోనస్ దానిని ధరించడం ద్వారా ఒక సరికొత్త చర్చకు తెరలేపారు. పెళ్లయిన వస్తువులను, గుర్తులను కేవలం మహిళలు మాత్రమే ధరించాలా? అనే చర్చ ఎప్పటి నుంచో ఉంది. చాలామంది పురుషులు పెళ్లి ఉంగరాలను కూడా పెట్టుకోవడానికి ఇష్టపడని ఈ రోజుల్లో, నిక్ జోనస్ తన భార్య దేశపు సంప్రదాయాన్ని తన మణికట్టుపై ధరించడం విశేషం. ఇది కేవలం స్టైల్ కోసం చేసిన ప్రయత్నం కాదు, తన భార్య నమ్మకాల పట్ల ఆయనకు ఉన్న గౌరవానికి, ప్రేమకు నిదర్శనం. భార్యాభర్తలు ఇద్దరూ సమానమే అనే భావనను ఆయన ఈ చిన్న చర్య ద్వారా చాటిచెప్పారు. నిక్ జోనస్ ప్రభావంతో ఇప్పుడు పురుషుల మంగళసూత్ర బ్రాస్‌లెట్లకు విపరీతమైన డిమాండ్ పెరుగుతోందని ప్రముఖ జ్యువెలరీ డిజైనర్లు చెబుతున్నారు. చాలామంది పురుషులు ఇప్పుడు తమ సంబంధాల్లో సమానత్వాన్ని కోరుకుంటున్నారని, అందుకే ఇలాంటి ఆభరణాల పట్ల ఆసక్తి చూపిస్తున్నారని 'డిఐ డిజైన్స్' ఫౌండర్ దిశా షా పేర్కొన్నారు. త్వరలోనే పురుషుల కోసం ప్రత్యేకంగా మంగళసూత్ర కలెక్షన్‌ను లాంచ్ చేయడానికి సిద్ధమవుతున్నట్లు ఆమె వెల్లడించారు. లోకమంతా టెక్నాలజీ, ఆధునికత వైపు పరుగులు తీస్తున్నా.. తమ మూలాలను, ఎదుటివారి సంస్కృతిని గౌరవించడమే నిజమైన ప్రేమ అని నిక్ జోనస్ నిరూపించారు. కేవలం సినిమా ప్రమోషన్ కోసం కాకుండా, మనసు నిండా ఉన్న ప్రేమతో ఆయన చేసిన ఈ పనికి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. పెళ్లి ఉంగరాలను ఇంట్లో మర్చిపోయే భర్తల కంటే, ఇలా భార్య సంస్కృతిని సొంతం చేసుకునే నిక్ జోనస్ లాంటి భర్తలు కావాలంటూ మహిళలు కామెంట్స్ చేస్తున్నారు.





# లెజెండ్స్ అపూర్వ కలయిక

భారతీయ సినిమా లివింగ్ లెజెండ్స్ కమల్‌హాసన్, రజనీకాంత్ 47 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత కలిసి నటించబోతున్న విషయం తెలిసిందే. ఈ ప్రతిష్ఠాత్మక సినిమా అప్‌డేట్స్ కోసం యావత్ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.శనివారం ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడింది. రెడ్ జాయింట్ మూవీస్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనుంది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తారు. ఈ చిత్రానికి 'కెహెచ్ డ ఆర్‌కే' అనే వర్కింగ్ టైటిల్‌ను పెట్టారు. 70వ దశకంలో రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి నటించారు. అనంతరకాలంలో వారిద్దరూ భారతీయ సినిమాలో తిరుగులేని స్టార్‌డమ్‌తో లెజెండ్స్‌గా ఎదిగారు. ఈ సందర్భంగా రెడ్ జాయింట్ మూవీస్ ప్రతినిధి మాట్లాడుతూ 'ఇదొక చారిత్రక ఘట్టం. ఇద్దరు దిగ్గజ నటులతో సినిమా చేయటం గొప్ప బాధ్యతగా భావిస్తున్నాం. మా కల నిజమైన అనుభూతి కలుగుతున్నది. భారీ వ్యయంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాం' అన్నారు. ఈ సినిమాకు అనిరుధ్ సంగీతాన్నందిస్తున్నారు.

# అండర్ 18... ఐశ్వర్య రాజేశ్ కొత్త సినిమా

## ఐశ్వర్య రాజేశ్, విక్రాంత్ ప్రధాన పాత్రల్లో రానున్న కొత్త సినిమా



ప్రముఖ నటి ఐశ్వర్య రాజేశ్, నటుడు విక్రాంత్ ప్రధాన పాత్రలలో తెరకెక్కుతున్న కొత్త చిత్రానికి 'అండర్ 18' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమా టైటిల్ లుక్‌ను ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ ఆవిష్కరించడం విశేషం. ఈ చిత్ర దర్శకుడు కార్తీక్ పెరుమాల్‌సామి గతంలో వెట్రిమారన్ దగ్గర అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేశారు.ఎస్ఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై బి. జగదీశ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'మద్రాస్‌కారన్' విజయం తర్వాత ఈ సంస్థ నిర్మిస్తున్న చిత్రమిది. 'అండర్ 18' సినిమా వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఒక ఎమోషనల్ క్రైమ్ డ్రామా అని చిత్ర యూనిట్ తెలిపింది. నేరం కారణంగా ప్రభావితమైన ఒక కుటుంబం యొక్క భావోద్వేగాలను, క్రైమ్ ప్రపంచంలోని క్రూరమైన కోణాలను ఈ సినిమాలో చూపించనున్నట్లు తెలుస్తోంది. తమిళనాడులోని అంతగా వెలుగులోకి రాని కొన్ని నేరాల నేథ్యాన్ని దర్శకుడు ఈ కథ కోసం ఎంచుకున్నారని సమాచారం. సామాజిక వాస్తవికత, కుటుంబ భావోద్వేగాల కలబోతగా ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రంలో కిశోర్‌తో పాటు పలువురు ప్రముఖ నటులు కీలక పాత్రలలో కనిపించనున్నారు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. హోసూర్, చెంగల్పట్టు, చెన్నైలోని వాస్తవ లొకేషన్లలో చిత్రీకరణ జరపనున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రాఫర్, దర్శకుడు వేల్‌రాజ్ కెమెరామ్యాన్‌గా పనిచేస్తుండగా, సామ్ సి.ఎస్. సంగీతం అందిస్తున్నారు. ఇళంగో కృష్ణన్, కార్తీక్ నేతా పాటలకు సాహిత్యం అందిస్తున్నారు.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAI, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/